PDF Compressor Free Version

Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 22.11.2013, శుక్రవారం సంపుటి : 33 సంచిక : 25 పేజీలు : 12, వెల : ₹ 4


ISO 9001-2008
Dr. A.Swaroop Kumar Reddy, M.D.S.,
Professor - Department of Conservative Dentistry
Specialist - Cosmetic, Lasers & Implant Dentistry
CARE
SUPER SPECIALITY
DENTAL HOSPITAL
16-1/72, Pogathota, Nellore -524 001, (A.P.)
Ph: 0861-2303300, 6555555
Reimbursement Facility For
State Government, APSPDCL & SHAR Employees

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

# రాష్ట్రానికి రాజ్యాంగ రక్షణ



- బ్రేకులు వేస్తున్న 371-డి
- తెరపైకి వస్తున్న కొత్త వాదనలు
- బిల్లు తెచ్చామని చెప్పడమే కాంగ్రెస్ లక్ష్యం
- తెలంగాణ వచ్చేది. రానిది దైవాధీనం

రాజ్యాంగ హననానికి పాల్పడైనాసరే రాష్ట్ర విభజన చేసితీరాలని కాంగ్రెస్ అధిష్టానం తీవ్ర పట్టుదలతో ఉంది. రాజ్యాంగాన్నే కాలరాచి కొత్త రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడం ద్వారా కాంగ్రెస్‌పార్టీ భవిష్యత్ తరాలవారికి ఎలాంటి సందేశమివ్వాలనుకుంటుందో ఎవరికీ అంతుబట్టడం లేదు. కాంగ్రెస్‌పార్టీ తెలంగాణ మీద ప్రేమతో ఈ రాష్ట్రాన్ని విడదీయాలనుకోవడం లేదు. ఇది అందరికీ తెలిసిన నగ్నసత్యం. వెనుకబాటుతనాన్ని ప్రాతిపదికగా చూపి తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడానికి ఎలాంటి ఆధారాలు లేవు. ఇంకా చెప్పాలంటే ఆంధ్రప్రదేశ్‌లో అంతర్భాగమయ్యాకే తెలంగాణ బాగా అభివృద్ధి చెందింది.


ఈ చారిత్రాత్మక వాస్తవాన్ని కాంగ్రెస్ మరచిపోలేదు. విస్మరిస్తుందంతే. చిన్నరాష్ట్రాలతోనే సత్వర అభివృద్ధి జరుగుతుంది కాబట్టి మేం తెలంగాణకు మద్దతునిస్తామని బీజేపీవాళ్లు చెప్పగలుగుతున్నారు. కాని కాంగ్రెస్‌ది చిన్నరాష్ట్రాల విధానం కాదు. తెలంగాణను ఎందుకు ఏర్పాటు చేయాలన్న ప్రశ్నకు వారి వద్ద సరైన సమాధానమే లేదు. తెలంగాణ కావాలని అక్కడి ప్రజలు ఉద్యమిస్తున్నారు కాబట్టి ఇస్తున్నామంటున్నారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో తమ జిల్లాను ప్రత్యేకరాష్ట్రంగా ప్రకటించాలని ప్రజలు ఉద్యమిస్తే అదే విధంగా రాష్ట్రాలను ఏర్పాటు చేస్తారా? కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం చేస్తున్న విభజన కాబట్టే కాంగ్రెస్ అధిష్టానం రాజ్యాంగ నిబంధనలకు సైతం తిలోదకాలు వదులుతోంది. కొత్తరాష్ట్రాల ఏర్పాటులో గత సాంప్రదాయాలను సైతం విస్మరిస్తోంది.

తాంబూలాలిచ్చేసాం... తన్నుకు చావండి అన్నట్లుగా తెలంగాణ బిల్లుపై కేంద్రప్రభుత్వం దూకుడు ప్రదర్శిస్తుంది. అర్జంటుగా తెలంగాణబిల్లు తయారు చేయాలి... నామ్‌కేవాస్తే అన్నట్లుగా రాష్ట్రపతికి, రాష్ట్ర శాసనసభకు పంపించాలి. అక్కడ నుండి వెంటనే పార్లమెంటులో పెట్టాలి, బిల్లును పార్లమెంట్ దాకా తెగలిగితే చాలు... మేం తెలంగాణ ఇచ్చేసినట్లేనని కేంద్రం భావిస్తుంది. అందుకోసమే తెగ హడావిడి చేస్తుంది. వడివడిగా బిల్లును రూపొందిస్తూ బిల్లు ఎప్పుడు ఎక్కడకు పోవాలనే తేదీలను కూడా ఖరారుచేస్తుంది. ఈ శీతాకాల సమావేశాలలో బిల్లు పెట్టకపోతే ఇక తెలంగాణ లేనట్లే! మళ్ళీ తెలంగాణ అంశం తెరపైకి వచ్చేది 2014 ఎన్నికల తర్వాతే. అప్పుడు కేంద్రంలో ఎవరుంటారో, ఎవరు వూడతారో తెలియని పరిస్థితి. కొత్తగా వచ్చే ప్రభుత్వం తెలంగాణ ఇస్తుందో లేదో తెలియదు. 2014 ఎన్నికల దృష్టితోనే కాంగ్రెస్ అధిష్టానం తెలంగాణ నిర్ణయం తీసుకుంది కాబట్టి రేపటి పార్లమెంటు సమావేశాలలోనే టీ-బిల్లు తెచ్చేసామనిపించుకోవాలి. టీ-బిల్లుకు ఆర్టికల్ 371-డి చిల్లు పెడుతుందన్న వాస్తవాన్ని కేంద్రం పట్టించుకోవడం లేదు. కేంద్ర హోంశాఖ కోరిన

(మిగతా 10వ పేజీలో)


## పోటెత్తిన భక్తజనం

(వివరాలు 12వ పేజీలో)




## భారత(యువ)రత్న

(వివరాలు 12వ పేజీలో)



## నారీనారీ నడుమ మురారి



- ఇరుప్రాంతాల తమ్ముళ్ళ పోరుతో సతమతమవుతున్న చంద్రబాబు

"ఇరువురి భామల కౌగిలిలో స్వామి ఇరుకున పడి నీవు నలిగితివా" అన్న సినిమాపాటలా వుంది తెలుగుదేశం అధినేత చంద్రబాబు పరిస్థితి. రెండుకళ్ల సిద్ధాంతం ఆయనకు నరకం చూపిస్తుంది. ఇంట్లో ఇద్దరు భార్యలున్నవాడి పరిస్థితి ఎంత హీనంగా, ఎంత దీనంగా వుంటుందో చంద్రబాబు పరిస్థితి కూడా అంతే హీనంగా వుంది. రెండుకళ్ల సిద్ధాంతానికి పోయినందుకు ఆయన రెండుకళ్లు మండుతున్నాయి.

తెలుగుదేశంపార్టీ పరంగా చంద్రబాబయితే రెండుకళ్ల సిద్ధాంతం పెట్టుకున్నాడుగాని ఆ పార్టీలో మిగతా నాయకులు ఆ సిద్ధాంతాన్ని ఫాలో కావడంలేదు. చంద్రబాబు కూడా గట్టిగా తనను ఫాలోకమ్మని చెప్పలేదు. పార్టీ మనుగడకోసం ఎవరి వాదనలు వారు ఫాలోకాండని చెప్పాడు. దానికి తగ్గట్లే తెలంగాణ తెలుగుదేశం నేతలు పక్కాగా విభజన వాదులుగా మారారు. టీఆర్ఎస్ నాయకుల కంటే అడ్డంగా మాట్లాడసాగారు. ఇటు చూస్తే సీమాంధ్ర తెలుగుదేశం నాయకులు సమైక్యవాదాన్ని గట్టిగా వినిపిస్తున్నారు. ఎవరి వాదనలు వాళ్ళు చేసుకుంటున్నంతసేపు చంద్రబాబుకు సమస్య రాలేదు. కాని రాష్ట్ర విభజనను సవాల్‌చేస్తూ తెలుగుదేశం నాయకులు సి.ఎం.రమేష్, పయ్యావుల కేశవ్ వంటివారు కోర్టులో పిటీషన్‌లు వేసారు. వీళ్లు చంద్రబాబుకు సన్నిహితులుగా పేరుంది. ఇక్కడే తెలంగాణ టీడిపి నేతలకు మండింది. వీళ్లే ఒకరిపై ఒకరు విమర్శలకు దిగడంతో వారికి సర్దిచెప్పలేక చంద్రబాబుకు తలప్రాణం తోకకువస్తుంది.

## సంధికాదు... సమరమే!



### అధిష్టానంతో అమీతుమీకి కిరణ్ సిద్ధం

రాష్ట్ర విభజన విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.కిరణ్ కుమార్‌రెడ్డి అనుసరిస్తున్న వైఖరికి అందరూ విస్తుపోతున్నారు. ఆయన ధైర్యాన్ని సమైక్యవాదులు అభినందిస్తున్నారు. తెలంగాణపై మూర్ఖంగా ముందుకు పోతున్న కాంగ్రెస్ అధిష్టానాన్ని ఆయన పదేపదే ఢీకొంటున్నారు. ఈ విషయంపై ఢిల్లీ పీఠాన్ని అదేపనిగా ప్రశ్నిస్తున్నారు.

కాంగ్రెస్ అధిష్టానంతో, ముఖ్యంగా అధినేత్రి సోనియా గాంధీతో వైరం పెట్టుకునే ధైర్యం ఎవరూ చేయలేరు. అలా శత్రుత్వం పెట్టుకున్నవాళ్లు ఎంతగా కష్టాలు అనుభవించారనే దానికి చరిత్రలో ఎన్నో ఋజువులున్నాయి. చరిత్రదాకా ఎందుకు నిన్నమొన్న జరిగిన జగన్ సంఘటనే పెద్ద ఉదాహరణ. కాంగ్రెస్ అధిష్టానాన్ని ఎదిరించినందుకు 16నెలలు జైలులో ఉండి మొన్ననే బయటకొచ్చాడాయన.

ఇన్ని సాక్ష్యాలు ఎదురుగా వున్న కాంగ్రెస్ అధిష్టాన నిర్ణయాన్ని ధిక్కరించాడంటే కిరణ్‌ది మొండిధైర్యమే. రాష్ట్ర విభజనను ఆయన మొదటి నుండి వ్యతిరేకించారు. సిడబ్ల్యుసి నిర్ణయం తీసుకోకముందు కాంగ్రెస్ అధిష్టానం రూట్‌మ్యాప్ అడిగినప్పుడే ఆయన రాష్ట్ర విభజనతో తలెత్తే సమస్యలను ఏకరువుపెట్టారు. విభజన నిర్ణయం తీసుకున్నాక రాష్ట్ర విభజనతో తలెత్తే సమస్యలను కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. రాష్ట్రంలో ఆయనకు అనుకూల పరిస్థితులు లేవు. తెలంగాణలోని అన్ని పార్టీల వారు ఆయనను శత్రువుగా చూస్తున్నారు. సమైక్యవాదిగా ఉన్నాడు కాబట్టి సీమాంధ్ర నేతలన్నా సహకరిస్తున్నారా అంటే అదీ లేదు. తన రాజకీయ ప్రయోజనాల కోసం తెలుగుదేశం,

(మిగతా 10వ పేజీలో)

## తెగుతున్న సంకెళ్లు బిగిస్తున్న పిడికిళ్లు!



- జగన్‌పై అంచెలంచెలుగా తొలుగుతున్న ఆంక్షలు

చంచల్‌గూడ జైలులో ఆయన 16నెలల పాటు నోరు, చేతులు, కాళ్లు అన్నీ కట్టేసుకుని వున్నాడు. తనను నమ్మిన జనానికి దూరమై జైలులో భారంగా గడిపాడు. కాని మొదట జైలుగోడలు బద్దలయ్యాయి. ఆపై క్రమక్రమంగా ఆంక్షల తెరలు తొలిగిపోతున్నాయి. దీంతో రాష్ట్ర రాజకీయాలలోనే కాదు జాతీయ రాజకీయాల్లోనూ అతడు కీలకంగా మారుతున్నాడు.

జగన్... కేంద్రంలో, రాష్ట్ర రాజకీయాల్లో నానుతున్న నాయకుడు. 16నెలల జైలుజీవితం తర్వాత ఈమధ్యే బెయిల్‌పై బయటకు వచ్చాడు. మొదట హైదరాబాద్ దాటిపోకూడదని కోర్టు నిర్దేశించింది. ఆ తర్వాత ఇడుపులపాయ వెళ్లడానికి అనుమతించింది. ఆపై రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించడానికి అంగీకరించింది. తర్వాత ఢిల్లీకి... కలకత్తా, లక్నోకు పోవడానికి అనుమతించింది. ఇలా ఆయనపై వున్న ఆంక్షలు ఒక్కొక్కటిగా తొలగిపోతుంటే, ఆయన అదే స్పీడుతో దూసుకుపోతున్నాడు. అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగపరచుకుంటున్నాడు. ఢిల్లీలో కాంగ్రెసేతర జాతీయపార్టీల నేతలనంతా కలిసాడు. రాష్ట్ర విభజన విషయంలో కాంగ్రెస్‌పార్టీ ఒంటెద్దుపోకడలను వారి దృష్టికి తీసుకెళ్లాడు. కలకత్తాలో పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని కలిసాడు. రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా ఆమె మద్దతును కూడగట్టగలిగాడు. అలాగే వివిధ ప్రాంతీయపార్టీల నేతలను కూడా కలిసి పార్లమెంటులో విభజన

(మిగతా 10వ పేజీలో)



ఒకరిది అభివృద్ధి ఏజెండా

మరొకరికి జగనే అండ



ఆత్మకూరులో...

# మారిన రాజకీయం

ఆత్మకూరు నియోజకవర్గంలో రాజకీయం ఒక స్పష్టమైన రూపం సంతరించు కుంటుంది. వచ్చే ఎన్నికల్లో ఆత్మకూరులో పోటీ ఏ విధంగా ఉండబోతుందో పరిస్థితులు ఇప్పుడే కళ్లకు కడుతున్నాయి. ఇంతకాలం ఆత్మకూరు వైయస్సార్ కాంగ్రెస్ అభ్యర్థి ఎవరా అనేది ఒక ప్రశ్నగా వుండేది. మేకపాటి గౌతంరెడ్డిని ఆత్మకూరు సమన్వయ కర్తగా నియమించినా మొన్నటివరకు ఆయన అటువైపు కన్నెత్తి చూడలేదు. ఒక దశలో ఆత్మకూరు నుండి ఆయన పోటీ వేయడనే ప్రచారం జరిగింది. ఈ దశలో అక్కడ అభ్యర్థిత్వంపై కొత్త నేతలు ఆశలుపెట్టుకున్నారు. కాని ఎట్టకేలకు గౌతంరెడ్డి ఇక్కడ బరిలో వుంటానని ప్రకటించడం, ఆ దిశగా తన పర్యటన మొదలుపెట్టడంతో సందేహాలకు తెరదించినట్లయ్యింది.

ఇక కాంగ్రెస్ అభ్యర్థిగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డే వుంటాడు. నూటికి 99శాతం ఇది ఖరారు. ఆరోజు పరిస్థితులను బట్టి ఎక్కడికన్నా మారుతాడేమో చెప్పలేక పోవచ్చు. ఇప్పుడున్న పరిస్థితులను బట్టయితే ఆయన ఆత్మకూరును వదిలిపోయే ప్రసక్తే లేదు. మధ్యలో తెలుగుదేశం తరపున ఎవరు పోటీచేసినా ఇక్కడ డమ్మీగానే మిగిలిపోవడం ఖాయం. ప్రధాన పోటీ మంత్రి ఆనం, మేకపాటి గౌతంల మధ్యే వుంటుంది.

ఆనం రామనారాయణరెడ్డికి, గౌతంరెడ్డికి మధ్యపోటీ అంటే రాజకీయంగా నక్కకు నాగలోకానికి పోటీ పెట్టడమే. వ్యక్తిగతంగా రాజకీయ సామర్థ్యం పరంగా చూస్తే ఆనం ముందు గౌతంరెడ్డి ఏ మాత్రం సరిపోడు. మూడు దశాబ్దాల రాజకీయానుభవం ఆనం రామనారాయణరెడ్డిదైతే, మూడేళ్లు కూడా రాజకీయానుభవంలేని యువకుడు గౌతంరెడ్డి. అనుకూల వాతావరణంలో కాదు వ్యతిరేక వాతావరణంలో కూడా ప్రత్యర్థు లను ఏవిధంగా నరుక్కురావాలి, ప్రజలకు ఎలా దగ్గరవ్వాలనేది తెలిసిన రాజకీయ మేధావి ఆనం రామనారాయణరెడ్డి. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్‌పార్టీని ప్రజలు అసహ్యించు కుంటున్నారు. మొన్నటిదాకా ప్రజల్లో అంతో ఇంతో వున్న ఆదరణ కూడా రాష్ట్ర విభజన ప్రకటనతో పోయింది. కాంగ్రెస్ తరపున పోటీ చేయాలంటేనే నాయకులు భయపడుతున్నారు. అయితే ఈసారి ఆనం రామనారాయణరెడ్డి ఆత్మకూరు నుండి కాంగ్రెస్ గుర్తింపుతో కాదు, అభివృద్ధి బ్రాండ్‌తో పోటీ చేయబోతున్నాడు. తాను పోటీ చేస్తున్న పార్టీని కాకుండా తాను చేసిన అభివృద్ధిని చూసి ఓట్లేయమని ప్రజలముందుకు పోనున్నారు. వాస్తవంగా చూస్తే ఆత్మకూరు చరిత్రలో ఇంతటి అభివృద్ధి కార్యక్రమాలు ఎప్పుడూ జరగలేదు. వందలకోట్ల నిధులను ఆత్మకూరుకు దోచిపెట్టాడు మంత్రి. చిన్నచిన్న గ్రామాలలో కూడా ఎంతోకాలంగా పెండింగ్‌లో వున్న పనులన్నింటికీ నిధులు మంజూరు చేయించాడు. ఆత్మకూరు రూపురేఖలు మార్చాడు. ఆర్థికమంత్రిగా తన పదవిని ఆత్మకూరు అభివృద్ధి కోసం సద్వినియోగం చేసుకున్నాడు. అంతేకాదు పార్టీ కేడర్‌ను, లీడర్‌లను కూడా బాగా పట్టుకొచ్చాడు. ఎవరిని కూడా తన చేజారనీయ లేదు. కాంగ్రెస్ కోసం కాకుండా తన కోసం వాళ్లంతా పనిచేసేలా మసలుకున్నాడు. ఇంతకాలం చేసిన అభివృద్ధినే ఆనం రేపటి ఎన్నికల్లో నమ్ముకోవాల్సి వస్తుంది.

ఆత్మకూరు నియోజకవర్గంలో గౌతంరెడ్డికి వ్యక్తిగతంగా ఏమీ లేదు. కేవలం జగన్ బ్రాండే అండగా వుంటుంది. ఆనం ఎంత అభివృద్ధి చేసినా అట్టడుగు వర్గాల ప్రజల్లో జగన్‌ను సీఎంగా చూడాలనే కోరిక బలంగా వుంది. అసెంబ్లీ ఎన్నికల నాటికి ప్రజలు ఈ అభివృద్ధినంతా మరచిపోతారని, కేవలం జగన్‌ను మాత్రమే గుర్తుపెట్టుకుని ఓట్లేస్తారని వైకాపా నాయకులు భావిస్తున్నారు. ఆమధ్య జరిగిన నెల్లూరు లోకసభ ఉప ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో వైకాపాకు 30వేల మెజార్టీ రావడాన్ని ఉదాహరణగా చూపుతున్నారు. రాష్ట్ర విభజన అంశం కూడా కాంగ్రెస్ పట్ల ప్రజలలో వ్యతిరేకత పెంచింది. ఈ దృష్ట్యా వచ్చే ఎన్నికల్లో అభివృద్ధి మంత్రాలేవీ పనిచేయవని, కేవలం జగన్ ప్రభంజనమే పనిచేస్తుందని వైకాపా నేతల నమ్మకం. రేపు ఇక్కడ పోటీ జరగబోయేది జగన్ ఇమేజ్‌కు ఆనం అభివృద్ధికే! ఆత్మకూరు ప్రజలు దేనివైపు నిలుస్తారనేది మారుతున్న కాలమే చెప్పాలి.

## తుఫాన్‌తో తుస్సుమంది...!

--- వాయిదాపడ్డ చంద్రబాబు 'ప్రజాగర్జన' ---

బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం జిల్లా తెలుగుదేశం నాయకుల ఆశలపై నీళ్ళు చల్లింది. తుఫాన్ మూలంగా ఈనెల 22వ తేదీన నెల్లూరు వీఆర్‌సి మైదానంలో తలపెట్టిన చంద్రబాబు ప్రజాగర్జన సభను వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. ఈ సభ కోసం జిల్లా తెలుగు దేశంపార్టీ నాయకులు విస్తృత ఏర్పాట్లు చేసారు. ఈ భారీ బహిరంగసభను విజయవంతం చేయడం ద్వారా ఇక ప్రజల్లోకి వేగంగా దూసుకుపోవాలని ఆ పార్టీ నాయకులు ఉత్సాహపడ్డారు. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల నుండి కూడా భారీగా జనసమీకరణకు శ్రీకారం చుట్టారు. ఒకటికి పదిసార్లు వీఆర్‌సి గ్రౌండ్‌కు వెళ్ళి ఏర్పాట్లను పరిశీలించారు. అయితే తుఫాను వారి ఉత్సాహానికి అడ్డుకట్ట వేసింది. చంద్రబాబు పర్యటన త్వరలోనే ఇంకోసారి పెట్టే అవకాశముంది.



తెల్లవారుజాము ప్రయాణంలో...

# తెల్లారుతున్న బ్రతుకులు

ప్రయాణం అంటేనే ప్రాణాలు అరచేతిలో పెట్టు కోవాల్సి వస్తుంది. అది కూడా రాత్రివేళల్లో ప్రయాణ మంటే ప్రాణాలు గాల్లో దీపాలవుతున్నాయి. ఎక్కడికో పోవాలని మనం ప్రయాణం మొదలుపెడితే అది చివరకు పరలోకప్రయాణంగా మారుతుంది.

ఇటీవలకాలంలో ప్రమాదాలు మరీ ఎక్కువవు తున్నాయి. ఈ ప్రమాదాలు పెరగడానికి కారణం వాహనాల డ్రైవర్లు నిబంధనలు అతిక్రమించి డ్రైవింగ్ చేయడం ఒకటయితే, విశ్రాంతి లేకుండా డ్రైవింగ్ చేయడం కూడా మరో కారణమవుతుంది. ఈ మధ్యకాలంలో జరిగిన ప్రమా దాలను గమనిస్తే వాటిలో ఎక్కువశాతం తెల్లవారుజామున జరిగినవే! మొన్న మహబూబ్ నగర్‌జిల్లా పాలెం వద్ద వోల్వో బస్సు దుర్ఘటన కూడా తెల్లారు జామున జరిగిందే! జాతీయ రహదారి మీద ఆపి వున్న లారీలను వెనుకనుండి వచ్చే వాహనాలు ఢీకొన్న ప్రమాదాల కైతే లెక్కేలేదు. ఈ తరహా ప్రమాదాలలో ఎక్కువ శాతం తెల్లారుజామున జరిగినవే!

- రక్తమోడుతున్న రహదారి
- నిబంధనలు పాటించడం లేదు
- ప్రాణాంతక ప్రయాణాలు... వరుసపెడుతున్న ప్రమాదాలు

మొన్న నెల్లూరుజిల్లా వెంకటాచలం మండలంలోని టోల్‌ప్లాజా సమీపంలో జరిగిన ప్రమాదం కూడా తెల్లవారు జామున జరిగిందే! కడపజిల్లా రాయచోటికి చెందిన ఓ కుటుంబం టాటా స్పేషియో వాహనంలో బయలుదేరారు. తెల్లవారుజామున 4గంటల సమయంలో టోల్‌ప్లాజా సమీపానికి వచ్చేసరికి డ్రైవర్‌కు నిద్రమత్తు ఆవహించింది. అతను డ్రైవింగ్‌లోనే కునుకుతీయడంతో వీళ్లు ప్రయాణిస్తున్న వాహనం అదుపుతప్పి రాంగ్‌రూట్‌లోకి వచ్చి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే చనిపోగా మరో ఇద్దరు నెల్లూరు పెద్దాసుపత్రిలో చనిపోయారు. డ్రైవర్‌కు నిద్రమత్తు వచ్చి కన్నురెప్ప వాల్చడం వల్లే 8మంది నిండు ప్రాణాలు గాలిలో కలిసాయి.

ముఖ్యంగా రాత్రివేళ ప్రయాణంలో జాగ్రత్తలు తీసు కోవాలి. దూరప్రయాణమప్పుడు డ్రైవింగ్ చేసేవారి పరిస్థితిని మిగతావాళ్లు గమనిస్తుండాలి. డ్రైవర్ ముఖంలో ఏ మాత్రం అలసట కనిపించినా వెంటనే వాహనాన్ని నిలిపివేసి డ్రైవర్‌ను కొంతసేపు నిద్రపొమ్మని చెప్పాలి. ప్రైవేట్ ట్రావెల్ ఏజన్సీలు బాడుగల కోసం డ్రైవర్లను డ్యూటీ దించకుండా పంపుతుంటారు. విశ్రాంతి లేని డ్రైవర్లతో ప్రయాణీ కుల ప్రాణాలకు ముప్పు పొంచివుంది. తెల్లారుజామున 2గంటల నుండి 6గంటల వరకు మంచి నిద్ర సమయం. ఎలాంటివారికైనా ఈ సమయంలో నిద్ర ముంచుకొస్తుం టుంది. అలాంటి సమయంలో ప్రయాణాన్ని ఆపుకోవడం, లేదా ఆ టైంకల్లా గమ్యం చేరుకునేటట్లు ప్లాన్ చేసుకోవడం ఉత్తమం. కార్లు, ఇతర వాహనాలలో దూరభార ప్రయాణం పెట్టుకుంటే డ్రైవరే కాకుండా ఇంకొకరన్నా డ్రైవింగ్ చేసే టట్లుండాలి. డ్రైవింగ్ దూరాన్ని షేర్ చేసుకోవడంవల్ల ఒకరే అలసిపోవడం, ప్రమాదం కొనితెచ్చుకోవడం ఉండదు. తెల్లారు జాము ప్రయాణంపై అప్రమత్తత ఎంతైనా అవసరం.

# ఎక్కువ కొత్త ముఖాలే!

## కాంగ్రెస్‌లో టికెట్ల ఉబలాటం తీరనుందా?



ఇంతకుముందు కాంగ్రెస్ టిక్కెట్ తెచ్చుకోవడమన్నా, కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ వేయడమన్నా నాయకులు అదృష్టంగా భావించే వాళ్లు. కాంగ్రెస్ నుండి అసెంబ్లీ టిక్కెట్ కోసం 10కోట్లు ఇవ్వ డానికి ఇంకో 10కోట్లు ఖర్చుపెట్టడానికి సిద్ధపడిన వాళ్లు కూడా వున్నారు. ఇప్పటిదాకా ఒక స్థాయి నాయకులకు కూడా కాంగ్రెస్ టిక్కెట్ అంటే కొండమీద కోతి లాంటిదే! కాని రేపటి ఎన్నికల్లో మాత్రం పరిస్థితి ఆ విధంగా లేదు.

జిల్లాలో నెల్లూరు లోకసభతో పాటు దాదాపు అయిదారు అసెంబ్లీ నియోజకవర్గాలకు కొత్త అభ్యర్థులను వెదికిపెట్టాల్సిన పరిస్థితులున్నాయి. నెల్లూరులోకసభకు పోటీచేసే దానికి వైయస్సార్ కాంగ్రెస్‌కు సిటింగ్ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఉన్నాడు. తెలుగుదేశానికి కూడా బలమైన అభ్యర్థి తయారుకాబోతున్నాడు. కాని కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయడానికే ఎవరూ సాహసించడం లేదు. మొన్న ఉపఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయిన టి.సుబ్బరామిరెడ్డి మళ్ళీ ఇక్కడ నుండి పోటీచేసే అవకాశాలు లేవు. ఖచ్చితంగా నెల్లూరు లోకసభకు కొత్త అభ్యర్థి కావాలి. ఉదయగిరి అసెంబ్లీకి మొన్న ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా కంభం విజయరామిరెడ్డి పోటీచేసి ఓడిపోయాడు. మరోసారి ఆయన పోటీ చేయకపోవచ్చు. ఇక్కడనుండి పోటీ చేసేందుకు మాజీ జిల్లాపరిషత్ ఛైర్మెన్ పి.చెంచలబాబుయాదవ్ సిద్ధంగా వున్నాడు. అయితే ఖర్చంతా పార్టీయే భరించాల్సి వుంటుంది. కావలిలోనూ ఇదే పరిస్థితి. మాజీఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మ ఇక ఇక్కడ పోటీచేయక పోవచ్చు. కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి ఇంకోసారి వైకాపాలోకి జంప్ చేసాడు. దీంతో ఇక్కడా ద్వితీయశ్రేణి కాంగ్రెస్ నాయకులకు టిక్కెట్ ఛాన్స్ తగలనుంది.

ఇక కోవూరు చూస్తే వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి తెలుగుదేశం లోకి పోయాడు. మాజీఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి కూడా తెలుగుదేశంలోకి మారే అవకాశముంది. అప్పుడు అక్కడ కాంగ్రెస్ అభ్యర్థిగా కొత్త వారికే అవకాశం రానుంది.

సర్వేపల్లి ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలుగుదేశంలో చేరడం ఖాయంగా కనిపిస్తుంది. ఆదాల వెళితే ఈ నియోజక వర్గంలో కాంగ్రెస్‌కు నాయకత్వలోపం ఏర్పడుతుంది. గట్టి అభ్యర్థి దొరకని పరిస్థితి. కాంగ్రెస్ అభ్యర్థిగా ఇక్కడా కొత్తవారిని వెదకక తప్పదు. సూళ్లూరుపేట నియోజకవర్గంలోనూ కాంగ్రెస్ పరిస్థితి అధ్వాన్నంగానే వుంది. మాజీఎమ్మెల్యేలు నెలవల, పసలలు వైకాపాలో చేరిపోయారు. ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి ఇక్కడ కాంగ్రెస్ కేడర్‌ను ఇంతవరకు కాపాడుతూ వచ్చాడు. ఇకముందు కాపాడాలంటే కష్టమే. కాంగ్రెస్‌కు కొత్త అభ్యర్థి ఎంపిక తప్పదు.

నెల్లూరురూరల్, నగరం, ఆత్మకూరు, గూడూరులలో మాత్రమే కాంగ్రెస్‌కు కొంచెం గట్టి నాయకత్వం వుంది. వెంకటగిరిలో నేదురుమల్లి కుటుంబం ప్రజాదరణ కోల్పోతుంది. ఇక్కడా కాంగ్రెస్‌కు గడ్డు పరిస్థితి తప్పేటట్లు లేదు.

PDF Compressor Free Version



# చేపలు తోమే పనే బాగుంది!



ఎంతో ఆసక్తిగా చేపలను తోముతున్న ఎమ్మెల్యే ఆనం వివేకా, తన అన్న పనితనాన్ని ఎంతో శ్రద్ధగా పరిశీలిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

కళలలో 64 రకాలున్నాయి. అందరికీ అన్నింటిలో ప్రావీణ్యం వుండదు. అలాగే బ్రతుకుదెరువు కోసం చేసే పనులలో కూడా ఎన్నో రకాలుంటాయి. ఉద్యోగం, వ్యాపారం, టీకొట్టు, బడ్డీబంకు, టిఫిన్ అంగడి, బొరుగుల మిక్చర్ బండి, మాంసం కొట్టు... ఇలా ఎన్నో. ఈ పనులన్నీ చేయడంలో ఆరితేరినవాడు నెల్లూరురూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి. టీబంకు ప్రారంభిస్తే అక్కడే టీ కాయడం, మాంసంకొట్టుకు పోతే మాంసం కొట్టడం, చాకిరేవుకు పోతే బట్టలుతకడం, బజ్జీల బండి వద్దకుపోయి బజ్జీలు వేయడం... ఇలా ఎన్నో రకాలుగా అలరిస్తుంటారు.

19వ తేదీ నెల్లూరు కిసాన్‌నగర్‌లో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చేతుల మీదుగా చేపలమార్కెట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వివేకా అక్కడే కొన్ని చేపలను తోమారు. వివేకా చేపల తోముడు పనితనం చూసి అక్కడ రోజూ చేపలమ్ముకునే వాళ్ళు కూడా ఆశ్చర్యపోయారు. ఈయన పెద్దబజార్‌లో వున్న చేపలమార్కెట్‌లో వుంటే చేపలు తోమితే రోజూ ఐదువందలు సంపాదించగలడని అనుకున్నారు.

# కళకళలాడుతున్న కేంద్ర సహకారబ్యాంకు



కంప్యూటరైజ్డ్ విభాగాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు అహ్మదుల్లా, ఆనం రామనారాయణరెడ్డి, డిసిసిబి ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, సిఇఓ కె.వి.రమణారెడ్డి, డిసిఎంఎస్ ఛైర్మెన్ సుమంత్‌రెడ్డి

నెల్లూరులోని జిల్లా కేంద్రసహకార బ్యాంకు ఇప్పుడు కొత్త సొకులతో కళకళలాడుతుంది. తాజా ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, కొత్త పాలకమండలి ఆధ్వర్యంలో ఈ బ్యాంకును కంప్యూటరైజ్డ్ చేసారు. ప్రైవేట్ కమర్షియల్ బ్యాంకులకు ఏ మాత్రం తీసిపోని రీతిలో బ్యాంకు లోపలిభాగాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. పాతతుప్పునంతా వదిలించారు. నూతనహంగులు సంతరించుకున్న బ్యాంకు కంప్యూటరైజ్డ్ విభాగాన్ని ఈ నెల 16వ తేదీన రాష్ట్ర ఆర్థికశాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి అహ్మదుల్లాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ సహకార రంగంలోని బ్యాంకుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణసహకారం అందిస్తుందన్నారు. నెల్లూరు బ్యాంకు ఆధునీకీకరణపై ప్రత్యేకశ్రద్ధ తీసుకుని దీన్ని ప్రైవేట్ బ్యాంకులకు తీసిపోని విధంగా తీర్చిదిద్దిన ఛైర్మెన్ ధనుంజయరెడ్డిని ఆయన అభినందించారు.

ఈ కార్యక్రమంలో బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, డీసీఎంఎస్ ఛైర్మెన్ వై.సుమంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఆనం విజయకుమార్‌రెడ్డి, బ్యాంకు మాజీఛైర్మెన్ వేమారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి, సిఇఓ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇస్కాన్‌లో తులసీకల్యాణం



ఈనెల 17వతేదీన నెల్లూరు కొండాయపాళెంరోడ్డులోని ఇస్కాన్ మందిరంలో తులసీ శాలిగ్రాం వివాహ్ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. తులసీ దేవితో శ్రీకృష్ణుని కల్యాణాన్ని భక్తులు కనులారా వీక్షించి పులకితులయ్యారు. ఇస్కాన్ ప్రతినిధి డాక్టర్ సుఖదేవస్వామి ఆధ్వర్యంలో పూజలు, భజనలు జరిగాయి.

# లోక్‌సభా...? అసెంబ్లీనా?



**సర్వేపల్లి ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలుగుదేశంలో చేరడం ఖాయమైనట్లు తెలుస్తుంది. అయితే వచ్చే ఎన్నికల్లో ఎక్కడనుండి పోటీ చేయాలనే ఆఫర్‌ను పార్టీ ఆయనకే వదిలేసినట్లు వార్త. ప్రస్తుతం తెలుగుదేశానికి ఆదాల వంటి నాయకులు కావాల్సి వుంది. కాబట్టి ఆయన నిర్ణయానికే ప్రాధాన్యతనిస్తున్నారు.**

ప్రస్తుతం నెల్లూరు లోక్‌సభ, నెల్లూరు నగరం, రూరల్ అసెంబ్లీలు ఆదాల పరిశీలనలో వున్నాయి. ఈ మూడు నియోజకవర్గాల మీద కూడా ఆదాల సర్వే చేయిస్తున్నట్లు సమాచారం.

నెల్లూరు లోక్‌సభకైతే ఆదాల గట్టి అభ్యర్థే అవుతాడు. ఆయనకు నెల్లూరు నగరం, రూరల్‌తో పాటు కోవూరు, కావలి, కందుకూరు నియోజకవర్గాలలో కూడా మంచి సంబంధాలున్నాయి. తెలుగుదేశంపార్టీ వారితో పాటూ కాంగ్రెస్ నాయకులు కూడా ఆయనకు సహకరించే అవకాశాలున్నాయి. కాకపోతే నెల్లూరు లోక్‌సభ నుండి వైకాపా అభ్యర్థిగా మేకపాటి రాజమోహన్‌రెడ్డి దిగుతాడు. ఇద్దరూ వియ్యంకులే! కాని పదవుల వద్ద సొంత అన్నదమ్ములే పోటీకి దిగుతున్నారు. కాబట్టి ఈ బంధుత్వం పెద్ద అడ్డం కాకపోవచ్చు.

నరేంద్రమోదీ ఛరిష్మాని వాడుకోవాలనే ప్రయత్నంలో వున్న చంద్రబాబు ఆశలు ఫలించి దేశం, బీజేపీలు రాష్ట్రంలో పొత్తుపెట్టుకుంటే పార్లమెంటుకు పోటీ చేయడం మంచి అవకాశంగా ఆదాల వర్గీయులు భావిస్తున్నారు. కాలం కలిసొస్తే తమ నేతను ఢిల్లీలో చూడాలన్నది వారి ఆశ. ఇప్పటికే మేకపాటిపై ప్రజల్లో వున్న అసంతృప్తి మోడీపై వున్న క్రేజ్ ఆదాలకు కలిసొచ్చే సంకేతాలేనన్నది రాజకీయ మేధావుల అంచనా.

నెల్లూరు నగరం, నెల్లూరురూరల్ అసెంబ్లీలలో ఆయనకు త్రిముఖపోటీ తప్పదు. నెల్లూరునగరంలో వైకాపా నుండి అనిల్, కాంగ్రెస్ నుండి ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డిలు రంగంలో వుండొచ్చు. నెల్లూరురూరల్‌లో అయితే వైకాపా నుండి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కాంగ్రెస్ నుండి ఆనం వివేకానందరెడ్డిలు వుండే అవకాశాలున్నాయి. ఈ రెండుచోట్లా ఆదాల ఎక్కడ పోటీచేసినా గట్టి ముక్కోణపుపోటీ ఖాయం. అసెంబ్లీ కంటే కూడా పార్లమెంట్‌కే ఆదాల బెటర్ అభ్యర్థి కాగలడు.

# వాసవి సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా శరణ్



వాసవి సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా నెల్లూరీయుడు, వాసవిక్లబ్ జిల్లా అధ్యక్షుడు చలువాది శరత్‌కుమార్‌ను నియమించారు. వాసవి క్లబ్ అధ్యక్షుడిగా విశిష్ట సేవాకార్యక్రమాలు నిర్వహించిన శరత్‌కుమార్‌ను ఇటీవల చెన్నైలో తమిళనాడు గవర్నర్ కె.రోశయ్య అభినందించారు. అలాగే వాసవిసేవాదళ్ కార్యదర్శిగా నెల్లూరుకు చెందిన గంగిశెట్టి మల్లిఖార్జున, జిల్లా అధ్యక్షులుగా వి.మురళీకృష్ణలను నియమించారు.

# స్టేడియం వాకర్స్ సేవా కార్యక్రమాలకు 4 అవార్డులు



నెల్లూరు దర్గామిట్టలోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ 2013లో చేసిన సేవా కార్యక్రమాలను గుర్తించి గుంటూరులోని వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ కాన్ఫరెన్స్‌లో ఈనెల 18న 4 అవార్డులు బహూకరించారు. స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఉత్తమ క్లబ్, ప్రెసిడెంట్ ఎస్.రాఘవేంద్రశెట్టికి, ఉత్తమ ప్రెసిడెంట్, కార్యదర్శి ఎస్.బలరామయ్యనాయుడుకు ఉత్తమకార్యదర్శి, ఎమ్‌జిఎఫ్ మోటివేటెడ్ అవార్డు రాఘవేంద్రశెట్టికి ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ డా॥ఎస్.వి.రావు, గవర్నర్ రామ్మోహన్‌రావులు ప్రదానం చేసారు. ఈసందర్భంగా రాఘవేంద్రశెట్టి మాట్లాడుతూ ఈఅవార్డులు ఎంతో సంతోషాన్నిచ్చాయని, వాకర్స్ అసోసియేషన్‌లోని సభ్యులందరి సహకారంతోనే ఇవి వచ్చాయంటూ వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. డిస్ట్రిక్ట్ కాన్ఫరెన్స్ నందు కోశాధికారి స్వర్ణ రమేష్‌బాబు, వాకర్స్ ఇంటర్నేషనల్ సభ్యులు శేషగిరిరావు, రంగారావు, హరిరావ్, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

# సినారాకు తెలుగువర్శిటీ కీర్తి పురస్కారం




నెల్లూరు సినారె (సి.నారాయణ రెడ్డి)గా గుర్తింపు పొందిన ప్రముఖ కవి, అందరూ సినారాగా పిలుచుకునే చిన్ని నారాయణరావుకు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన పురస్కారం లభించింది. రెండున్నర దశాబ్దాల ఆయన విశిష్ట సాహితీ సేవను గుర్తించి శ్రీ పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆయనను 2012 సంవత్సరానికి గాను కీర్తి పురస్కారానికి ఎంపికచేసింది. ఈ నెల 28న హైదరాబాద్‌లో జరిగే ఓ ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ఈ పురస్కారం స్వీకరిస్తారు. ఆయన రచించిన 'మాట' కవితాసంపుటి సాహితీప్రముఖుల ప్రసంశలు అందుకుంది. ఆయనకు ఈ కీర్తిపురస్కారం దక్కడంలో 'మాట' ఎంతగానో దోహదపడింది. ఒక నెల్లూరీయుడిగా నెల్లూరుజిల్లా సాహితీరంగానికి కీర్తి తెచ్చేలా, స్ఫూర్తినిచ్చేలా కీర్తిపురస్కారాన్ని అందుకుంటున్న చిన్ని నారాయణరావుకు 'లాయర్' అభినందనలు.

# పత్తి సీతారాంబాబుకు గౌరవ డాక్టరేట్




ప్రముఖ పారిశ్రామికవేత్త, సౌత్ సెంట్రల్ రైల్వే సభ్యులు నెల్లూరీయులు పత్తి సీతారాంబాబు శ్రీలంక యూనివర్సిటీ నుండి గౌరవ డాక్టరేట్ అందుకోనున్నారు. ఈనెల 22, 23, 24 తేదీల్లో శ్రీలంక రాజధాని కొలంబోలో జరగనున్న ప్రపంచ ఇంటిగ్రేటెడ్ మెడిసిన్స్ యూనివర్సిటీ సమావేశాల్లో ఆయనకు ఈ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేస్తారు. ఆయన సేవాకార్యక్రమాలను గుర్తించి ఇటీవల ఢిల్లీలోని లాల్‌బహదూర్‌శాస్త్రి ఫౌండేషన్ ఇండియన్ అచ్చీవర్స్ ఫోరం అవార్డును ప్రదానం చేసారు. ఆయన తన తాత పత్తి నరసింహులుశెట్టి ట్రస్ట్ ద్వారా అనేక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తుండడం వల్ల వాటిని గుర్తించిన శ్రీలంక యూనివర్సిటీ ఈగౌరవ డాక్టరేట్‌కు ఆయనను ఎంపిక చేసింది.

# కార్తీకదీపాలతో శోభిల్లిన శైవక్షేత్రాలు



పరమపవిత్రమైన కార్తీకమాసం మూడవ సోమవారం నెల్లూరు నగరంలోని అన్ని శైవక్షేత్రాలు కార్తీకదీపాలతో శోభిల్లాయి. నెల్లూరు మూలపేటలోని శ్రీభువనేశ్వరి సమేత శ్రీమూలస్థానేశ్వర స్వామి దేవస్థానం, దర్గామిట్టలోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలోని మీనాక్షి సమేత సుందరేశ్వర స్వామి, వహాబ్‌పేట ఉమామహేశ్వర స్వామి దేవస్థానం, నవాబుపేట దుర్గామల్లేశ్వరాలయం, ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరాలయం, సంతపేట కంసాలివీధిలోని భ్రమరాంబ సమేత హరిహరనాథస్వామి దేవస్థానం, కొండాయపాళెం రోడ్డులోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరాలయం, మూలాపేటలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయం, భక్తవత్సలనగర్, పడారుపల్లి, కిసాన్‌నగర్, వెంకటేశ్వరపురం తదితర ప్రాంతాల్లోని శైవ క్షేత్రాలో శ్రీస్వామివారికి పాలాభిషేకాలు, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, విశేషపూజలు నిర్వహించారు. ఆలయ ప్రదక్షిణోత్సవాలు, పేట ఉత్సవాలు కనువిందుగా జరిగాయి. ఆలయాల కార్య నిర్వహణాధికారులు, ధర్మకర్త మండలి సభ్యుల పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమాల్లో భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

PDF Compressor Free Version




## ఇంట గెలిచి రచ్చగెలవాలి

ఇల్లు చూచి, ఇల్లాల్ని చూడమన్నారు. ఇల్లు పరిశుభ్రంగా, చూడముచ్చటగా ఉంటే ఇల్లాలు ఎటువంటిదో మనం అర్థం చేసుకోవచ్చు. వెన్నుపోటు, కుమ్మక్కు బిరుదాంకితుడైన రెండుకళ్ళ సిద్ధాంతకర్త చంద్రబాబు అధ్వర్యంలో నడిచే తెలుగుదేశంపార్టీ తెగులు తగిలిన కోడిలా, చెదలుపట్టిన ఇల్లులావుంది. ప్రజాసమస్యలను పట్టించుకోకుండా కాంగ్రెస్‌తో కుమ్మక్కయి ఇంటిలో ఈగలమోత ఉంటే బయట పల్లకీల మోతకు (ఎన్డీఏ కన్వీనర్‌గా ఉండేందుకు) రాజ్‌నాథ్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న చంద్రబాబు, ఆనాడు వాజ్‌పేయ్‌తో జత కట్టబట్టే ముందస్తు ఎన్నికలకు వెళ్ళి ఘోరంగా పరాజితులైనామన్నాడు. దాన్ని కమలనాథులు ఇప్పటికీ తట్టుకోలేకున్నారు. చంద్రబాబుతో జతకట్టే బీజేపీ ఒక దశాబ్దం పాటు అధికారానికి దూరం కావాల్సివస్తుంది. ఇప్పుడున్నది ఎన్టీఆర్ తెలుగుదేశం కాదు చంద్రబాబు తెగులు దేశం. కమలనాథులు జాగ్రత్తపడాలి.

కురుగూరు రంగనాథం,
నెల్లూరు.

## సచిన్‌కు అభినందనలు

అతిచిన్న వయసులోనే 'భారత రత్న' అందుకున్న మాస్టర్‌బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్‌కు అభినందనలు. ఈ అవార్డు అతనికి కాదు మొత్తం క్రికెట్ ఆటకే దక్కిందనుకోవాలి. సచిన్ ఆట తీరే కాదు, అతని ప్రవర్తనను కూడా నేటి యువతరం ఆదర్శంగా తీసుకోవాలి. బారత క్రికెట్ బోర్డు సచిన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

జి. యోగేష్, చెన్నై.

## కలిసుంటే అన్ని గుళ్లు మీవే!

భద్రాచలంపై తెలంగాణవాళ్ళు మాకే చెందాలని పట్టుబడుతుండడం శోచనీయం. ఇప్పుడున్న రాష్ట్రంలో అన్నిగుళ్లు వారివే కదా! ప్రపంచంలోనే ప్రసిద్ధక్షేత్రమైన తిరుమల వెంకన్న, ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన శ్రీశైలం మల్లన్న, పంచభూత లింగాల్లో ఒకటైన శ్రీకాళహస్తి, అన్నవరం సత్యదేవుడు... ఇలా అన్ని క్షేత్రాలు కలిసుంటే మావేననుకోవచ్చు కదా!

కె.ఎస్.నాథం, తిరుపతి.

# 'ప్రభా'తం

'కోతి పుండు బ్రహ్మాండం' అంటారు. ఒక సమస్యను మనమే సృష్టించుకుంటాం... ఆ సమస్య చుట్టూరా రాజకీయాలు అల్లేస్తాం. ఆ సమస్యను దేశ ప్రజల సమస్యగా మారుస్తాం... ఆ సమస్య పరిష్కారం కోసమని చెప్పి వేలు, లక్షల కోట్లు ఖర్చుపెడుతుంటాం. కాని ఎంతకీ ఆ సమస్య మాత్రం పరిష్కారం కాదు. ఈ కోట్లు మాత్రం మంచినీళ్ళ ప్రాయంగా ఖర్చవుతూనే వుంటాయి. మన దేశంలో ఏ రంగానికి ఎంత వ్యయం చేయాలి, ఏ రంగానికి ప్రాధాన్యతనివ్వాలనేదానిపై పొంతన వుండడం లేదు. దేని మీద ఖర్చుపెడితే ఓట్లు ఎక్కువగా వస్తాయనుకుంటే దాని కోసమే ఖర్చుపెడుతుంటారు.


మన కేటాయింపులు ఎక్కువగా రక్షణకే వుంటాయి. ముఖ్యంగా స్వదేశీ, సీమాంతర ఉగ్రవాద చర్యలను నిరోధించడానికి చేసే ఖర్చు తడిసి మోపెడవుతుంది. స్వదేశీ తీవ్రవాదాన్ని సామాజికకోణంలో చూడొచ్చు. ఎందుకంటే ఇక్కడ తీవ్రవాదంవైపు నడుస్తున్నది ఇక్కడివాళ్లే కాబట్టి, వాళ్లు ఏ పరిస్థితుల్లో అటు వెళుతున్నారో పరిశీలించి, వారి సమస్యలను పరిష్కరించడం ద్వారా స్వదేశీ తీవ్రవాదాన్ని అరికట్ట వచ్చు. కాని సీమాంతర ఉగ్రవాదాన్ని కఠినంగా అణచివేయాల్సి వుంటుంది. కఠిన చట్టాలు, కఠిన నిర్ణయాల ద్వారానే సీమాంతర ఉగ్రవాదాన్ని బలంగా నియంత్రించగలం. అయితే ప్రభుత్వం వద్ద కఠిన విధానాలు లేకపోవడంతో సీమాంతర ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి ప్రతిరోజూ ఖర్చు చేయాల్సి వస్తుంది. స్వాతంత్ర్యానంతరం దేశంలో ఆయా సంస్థానాల విలీనం జరిగింది. జమ్మూ, కాశ్మీర్ విలీనం విషయంలో ఆనాడు ప్రధానిగా వున్న పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ కొంచెం కఠినంగా వ్యవహరించి వుంటే ఈరోజు ఆ సమస్య ఇంతదాకా వచ్చేది కాదు. ఈరోజుకీ మనకు పాకిస్థాన్ పక్కలో బల్లెంలా తయారై, సరిహద్దుల రక్షణ కోసం లక్షలకోట్లు కుమ్మరిస్తున్నామంటే కారణం ఆరోజు ఈ సమస్యను కఠినంగా పరిష్కరించకపోబట్టే. ఈరోజుకీ అదొక సమస్యలాగే మిగిలిపోయింది.

మన దేశంలో ఏ రంగానికైతే ప్రాధాన్యతనివ్వాలో వాటిని విస్మరిస్తూ, వేటినైతే తగ్గించుకోవాలో వాటికి మాత్రం నిధులు కుమ్మరిస్తున్నారు. మొన్ననే భారతరత్న అవార్డు ప్రకటించబడ్డ ప్రఖ్యాతశాస్త్రవేత్త సిఎన్ఆర్ రావు ఈ విషయంపైనే రాజకీయ నేతలను తూర్పారబట్టారు. భారత రాజకీయ నాయకులను 'ఇడియట్స్'గా సంబోధిస్తూ శాస్త్రవిజ్ఞాన రంగానికి దేశంలో ప్రోత్సాహం కొరవడిందంటూ ఆవేదన వ్యక్తం చేసారు. ఆయన మాటలు, ఆయన ఆవేదన అక్షరసత్యం. విద్య, విజ్ఞానంపైనే దేశ భవిష్యత్ ఆధారపడి వుంటుంది. ముఖ్యంగా సైన్స్‌పైనే దేశ భవిష్యత్ ఆధారపడి వుంటుంది. ఈ రంగంలో పురోగతి సాధించిన దేశాలే బాగా అభివృద్ధి సాధించాయని ఆయన పేర్కొన్నారు. వాస్తవమైన అభివృద్ధి సైన్స్ పునాదుల మీదే ఆధారపడి వుందన్నది పచ్చి నిజం.

శాస్త్ర విజ్ఞానానికి సంబంధించి మనకంటే చిన్నదేశాలే ఎంతో ముందున్నాయి. ముఖ్యంగా సైన్స్‌కు కేటాయిస్తున్న నిధులు తక్కువగా వుండడం, ప్రోత్సాహం కరువవడంతో ఆ రంగంలోని నిష్ణాతులు విదేశాలవైపు చూస్తున్నారు. అమెరికాలో పేరుమోసిన వైద్యులు భారతీయులే... శాస్త్రవేత్తలు భారతీయులే! కేవలం ధనార్జనే ధ్యేయంగా చాలామంది విదేశాలకు పోతున్నారన్న సిఎన్ఆర్‌రావు మాటల్లో ఎంతో వాస్తవముంది.

సైన్స్‌లో అమెరికా, చైనా, జపాన్, జర్మనీ వంటి దేశాలు మనకు అందనంత ఎత్తులో వున్నాయి. వాళ్లు పరిశోధనల్లో పురోగమిస్తున్నారు. కాని మన దేశంలో విద్యా పరంగా సైన్స్‌కు ప్రోత్సాహం కరువవుతుంది. చదువంటే ఇంజనీర్లు, డాక్టర్లు, కలెక్టర్లు అన్నట్లుగా వుంది. వీళ్లలో మేధావులు కూడా భారత దేశంలో వుండాలనుకోవడం లేదు. ఎక్కువ డబ్బుకు ఆశపడి విదేశాలలో స్థిరపడుతున్నవాళ్లే!

మనకంటే చైనా అన్ని రంగాల్లోనూ ఎంతో ముందుంది. చైనాకు మనకు ఓ చిన్న తేడా చూద్దాం. చైనా జనాభా 140కోట్లు అనుకుంటే ఇందులో వృద్ధులు, అనారోగ్యపీడితులు, పని చేయలేని నిస్సహాయులు మొత్తం కలిపి 50కోట్ల మందిని తీసిపక్కనపెడితే 90కోట్లమంది ఖచ్చితంగా పనిచేస్తారు. వారి పనిగంటలు కూడా 12గంటలకు తగ్గవు. కాబట్టి వాళ్ల ఉత్పాదన చాలా ఎక్కువగా వుంటుంది. అదే మన దేశ జనాభాను 120కోట్లుగా తీసుకుంటే అందులో ఆడవారు 60కోట్లనుకుందాం. వారిలో పనిచేసేవాళ్లు 10కోట్లనుకుందాం. ఇక 60కోట్ల మంది మగవారిలో చదువుకునే వారిని, వృద్ధులను, అనారోగ్యంతో వున్నవారిని, ఏ పనీలేని పోమరులను ఓ 30కోట్లమంది వుంటారనుకుందాం. మిగిలిన 30కోట్లు, మహిళలు ఓ 10కోట్లు మొత్తం 40కోట్లమంది పనిచేస్తే 120కోట్ల జనభారతం బ్రతకాలి. ఒకడు పనిచేస్తే నడిచే కుటుంబానికి, నలుగురు కలిసి పనిచేస్తే నడిచే కుటుంబానికి ఎంత వ్యత్యాసముంటుందో భారత్, చైనాల అభివృద్ధి తేడాలలోనే తెలుస్తుంది. మన దేశంలో ఇప్పుడు కావాల్సింది లక్షలకోట్లు ఖర్చుచేసి ఫ్రీగా అందరికీ ఆహారధాన్యాలు అందించే ఆహార భద్రత పథకాలు కాదు. అందరికీ పనికల్పించే శాస్త్ర సాంకేతిక రంగంలో పురోగతి.



### ప్రోత్సాహం కరువే!

శాస్త్ర విజ్ఞానానికి సంబంధించి మనకంటే చిన్నదేశాలే ఎంతో ముందున్నాయి. ముఖ్యంగా సైన్స్‌కు కేటాయిస్తున్న నిధులు తక్కువగా వుండడం, ప్రోత్సాహం కరువవడంతో ఆ రంగంలోని నిష్ణాతులు విదేశాలవైపు చూస్తున్నారు. అమెరికాలో పేరుమోసిన వైద్యులు భారతీయులే.. శాస్త్రవేత్తలు భారతీయులే!

# 'అంతర్'జాతీయం

- విమాన వాహకనౌక ఐఎన్ఎస్ విక్రమాదిత్యను భారత నౌకాదళంలోకి ప్రవేశపెట్టారు. రష్యాలోని సెవ్‌మాష్ నౌకాశ్రయంలో ఈ నెల 16వ తేదీన జరిగిన ఓ కార్యక్రమంలో భారత రక్షణమంత్రి ఏ.కె.ఆంటోని, రష్యా ఉపప్రధాని ద్మిత్రీ రోగొజిన్‌ల సమక్షంలో 44500టన్నుల బరువుగల 14వేల కోట్ల విలువైన ఈ భారీ యుద్ధనౌకను భారత నేవీకి అప్పగించారు. అలాగే అమెరికా రక్షణ దిగ్గజం బోయింగ్ సంస్థ రూపొందించిన పి-8ఐ నిఘా విమానాన్ని భారత నౌకాదళానికి అప్పగించారు.
- షిరిడిలోని సాయిబాబా సన్నిధిలో ఇక వారంలోని అన్నిరోజులూ హారతి పాసులు ఇవ్వనున్నారు. ఈమేరకు సన్నిధి ట్రస్ట్ నిర్ణయం తీసుకుంది.
- ఈ నెల 17న రష్యాలో ఘోర విమానప్రమాదం జరిగింది. మాస్కో నుండి వచ్చిన బోయింగ్ 737 విమానం కజన్ విమానాశ్రయంలో రన్‌వేను ఢీకొట్టి పేలిపోయింది. ఈ ప్రమాదంలో 50మంది ప్రయాణీకులు మృతిచెందారు.
- మాల్దీవుల్లో రెండేళ్లుగా కొనసాగుతున్న రాజకీయ అనిశ్చితికి తెరపడింది. ఆ దేశ అధ్యక్షుడిగా అబ్దుల్లా యమీన్ 17వ తేదీ ప్రమాణస్వీకారం చేసారు.
- సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి బ్రహ్మోస్‌కు చెందిన అత్యాధునిక వెర్షన్‌ను భారత సైన్యం ఈ నెల 18వ తేదీన విజయవంతంగా ప్రయోగించింది. రాజస్థాన్‌లోని పోఖ్రాన్ ఫైరింగ్‌రేంజ్‌లో ఉదయం 10.55గంటలకు ఈ ప్రయోగం జరిగింది. ఇది నిర్దేశిత మార్గంలో ప్రయాణిస్తూ లక్షిత కాంక్రీట్ నిర్మాణాన్ని అత్యంత ఖచ్చితత్వంతో ఛేదించింది. ఇది 290కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలుగుతుంది. 300కిలోల బరువుగల వార్‌హెడ్‌లను తీసుకెళుతుంది.
- అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన సచిన్ టెండూల్కర్‌కు బ్రిటన్ చట్టసభ హౌజ్ ఆఫ్ కామన్ అభినందనలు తెలిపింది. ఈమేరకు సభలో తీర్మానం చేసారు.
- మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం స్వల్పంగా గాయపడ్డారు. న్యూఢిల్లీలోని తన ఇంట్లో కలాం జారి క్రిందపడటంతో ఆయన నుదిటికి గాయమైంది. సైనిక ఆసుపత్రిలో ఆయనకు వైద్యచికిత్స నిర్వహించారు.
- ప్రపంచంలోకల్లా అత్యంత వేగంగా పనిచేసే సూపర్‌కంప్యూటర్లలో చైనాయే మొదటి స్థానంలో నిలిచింది. చైనా రక్షణ సాంకేతిక జాతీయ విశ్వవిద్యాలయం సెకనుకు 33.86పెటాఫ్లాప్ వేగంతో పనిచేసే కంప్యూటర్‌ను అభివృద్ధి చేసింది.
- పాక్‌లో భారత సినిమాల ప్రదర్శనపై ఆంక్షలు విధిస్తూ లాహోర్ న్యాయస్థానం తీర్పుచెప్పింది. భారత సినిమాల విడుదలపై కొన్ని నిబంధనలు విధించింది.

# వార్త వ్యాఖ్య

వార్త :- జీవోఎం ఎదుట సమైక్యవాణి వినిపిస్తాం.
– కేంద్రమంత్రి పురంధరేశ్వరి.
వ్యాఖ్య :- *వచ్చి శవమై, కాలి బూడిదయ్యాక ఇప్పుడేదుస్తామంటారా?*

వార్త :- పదవులు కావాలా... ప్రజలు కావాలా?
– సీమాంధ్ర నేతలకు అశోక్‌బాబు హెచ్చరిక.
వ్యాఖ్య :- *ప్రజలు అవసరం లేదని వాళ్లెప్పుడో చెప్పేసారుగా!*

వార్త :- వాజ్‌పేయికి భారతరత్న ఎందుకివ్వలేదు. – భాజపా.
వ్యాఖ్య :- *ఆయన క్రికెట్ ఆడలేదుగా!*

వార్త :- ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలి. – చంద్రబాబు డిమాండ్.
వ్యాఖ్య :- *దాంతోపాటు మీకు వెన్నుపోటు రత్న ప్రకటించాలి.*

వార్త :- త్యాగాలకు సిద్ధం... రాష్ట్రం కలిసుండడమే ముఖ్యం. – సీఎం.
వ్యాఖ్య :- *అంటే సీఎం పదవిని వదులుకుంటాననేగా!*

వార్త :- కిరణ్‌కు కొత్తపార్టీ ఆలోచన లేదు. – మంత్రి పితాని.
వ్యాఖ్య :- *కొత్తపార్టీ అంటే ఆవును అమ్ముకుని ఏనుగును కొన్నట్లే కదా!*

వార్త :- భాజపా ఓ దొంగల పార్టీ. – రాహుల్.
వ్యాఖ్య :- *ఆ లెక్కన మనది బందిపోటుల పార్టీనా?*

వార్త :- రంగులు మారుస్తున్న జగన్. – దేశంనేత యనమల.
వ్యాఖ్య :- *చొక్కా రంగులా?*

వార్త :- రాయలతెలంగాణకు మద్దతివ్వండి. – జేసీ దివాకర్‌రెడ్డి.
వ్యాఖ్య :- *టాక్స్‌కట్టే పనిలేకుండా బస్సులు నడుపుకోవచ్చుననా?*

వార్త :- సోనియాగుడికి సొంత స్థలం. – మాజీమంత్రి శంకర్‌రావు.
వ్యాఖ్య :- *సీమాంధ్రలో ఆమె సమాధులకు మాత్రం స్థలాలు ఫ్రీగా ఇస్తామంటున్నారు.*

వార్త :- ఇందిర వల్లే రాష్ట్రం సమైక్యంగా ఉంది. – సీఎం.
వ్యాఖ్య :- *అత్తకు కోడలు రివర్స్ కదా... అందుకే విడదీస్తుంది.*

వార్త :- భారతరత్నకు వాజ్‌పేయి అర్హుడు. – నితీష్, ఫరూక్ వ్యాఖ్యలు.
వ్యాఖ్య :- *కాబట్టే అయనకు ఇవ్వడం లేదు.*

వార్త :- విభజనకు తీవ్రవాదానికి ముడేమిటి?
– సీపీఐ కార్యదర్శి నారాయణ.
వ్యాఖ్య :- *దేశం విడిపోయాకే ఉగ్రవాదం పెరిగింది, రాష్ట్రాల చీలికతోనే నక్సలిజం పెరిగింది. ఆ మాత్రం తెలియదా?*

PDF Compressor Free Version



# అయ్యోర్ల కొరతతో చదువులకు బ్రేక్

నెల్లూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అయ్యోర్ల కొరత అతివృష్టి అనావృష్టిగా వుంది. కొన్నిచోట్ల ఉండాల్సిన దాని కంటే ఎక్కువ వుంటే, మరికొన్ని చోట్ల 50మంది విద్యార్థులకు ఒక్క టీచరు కూడా లేదు. ముఖ్యంగా సోషల్, ఫిజిక్స్, లెక్కలు, తెలుగు ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వుంది. దీనికితోడు ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం నిర్వహణతో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేక సిలబస్ పూర్తి కావడం లేదు. 3, 4 నెలల్లో పదవ తరగతి సంవత్సర పరీక్షలకు విద్యార్థులు రడీ కావాల్సివుంది. నెల్లూరు జిల్లాలోని 385 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరతతో బోధన కుంటుపడింది. సమ్మె కారణంగా జిల్లాలో విద్యార్థులు ఇప్పటికే రెండునెలల కాలాన్ని కోల్పోయారు. ప్రస్తుతం కొన్ని పాఠశాలల్లో 300మంది విద్యర్థులకు 40 మంది, 700మంది విద్యార్థులకు 16మంది ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు.

నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని 15 పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వుంది కొన్ని పాఠశాలల్లో 700 మంది విద్యార్థులకు 20మంది ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. ఒక్క స్కూల్లో హిందీ టీచర్ లేదు, మరో స్కూల్లో తెలుగు ఉపాధ్యాయుడు పోస్టు ఖాళీగా వుంది. ఇలా ఒక్కో స్కూల్లో ఒక్కో సమస్య వుంది.

# దూడల పోషణకు 1.70కోట్లు

దూడల పోషణకు దాదాపు రూ॥1.70కోట్లు కేటాయిస్తున్నారని, కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన దూడలకు చెందిన ఎస్సీ, ఎస్టీ రైతులు వైద్యులకు సహకరించి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు భాస్కర్ కోరారు. సునందిని పథకం అమల్లో భాగంగా దూడల పోషణ పథకం కింద జిల్లాలో కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన 3988దూడలకు 24నెలలు పాటు ఉచిత దాణా అందిస్తామన్నారు. నార్మల్ స్టేట్‌ప్లాన్, రాష్ట్రీయ కృషి వికాశయోజన పథకాల కింద 2013-14 సంవత్సరానికిగాను నాలుగు నెలలు నిండిన 3988దూడలను ఎంపికచేసి ఒక్కోదూడకు 5వేలు విలువైన దాణాలో 4025రూ॥లు ప్రభుత్వం భరిస్తుందని మిగిలిన 975రూ॥లు రైతులు భరిస్తారని తెలిపారు.

దీంతో పాటు ఇన్సూరెన్స్ అందిస్తున్నామని, గుర్తింపుకార్డులు మంజూరు చేస్తామన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎదసూది వేసి కృత్రిమంగా పుట్టిన దూడల్లో కుటుంబానికి రెండింటికి మాత్రమే అందిస్తున్నామన్నారు. ఒక్కో మండలానికి సగటున 49దూడలను ఎంపికచేయమని వైద్యులకు సూచించినట్లు తెలిపారు.

# రుణాల మంజూరుపై దృష్టిసారించాలి

డిపాజిట్ల సేకరణ, రుణాల మంజూరుపై దృష్టిసారించాలని, నెల్లూరుజిల్లాలో గ్రామీణ బ్యాంకులు అన్ని శాఖల ద్వారా 25లక్షల వరకు గృహ రుణాలను మంజూరు చేయనున్నట్లు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఛైర్మన్ పి.సంపత్‌కుమార్‌చారి పేర్కొన్నారు. మంగళవారం నెల్లూరు కలెక్టరేట్ గోల్డెన్ జూబ్లీహాల్లో ఆ బ్యాంకు మేనేజర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మార్చి నెలాఖరుకు నెల్లూరు, ప్రకాశం, కడప, అనంతపురం, కర్నూలు జిల్లాలో 70వరకు ఏటీఎం కేంద్రాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. మార్చినాటికి 830కోట్లు డిపాజిట్లు, 1260కోట్లు రుణాలు మంజూరు లక్ష్యంగా పనిచేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాంతీయ అధికారి మస్తానయ్య, ముఖ్య మేనేజర్ ఎస్.వి.రామసుబ్బారావు, సీనియర్ మేనేజర్లు కె.వి.గోపీనాథ్, కిరణ్‌కుమార్, సుబ్బారావు, బ్యాంక్ మేనేజర్లు రవిచంద్రారెడ్డి, చంద్రమౌళి, పివిఎస్ నాయుడు, శ్రీహరి రెడ్డి పాల్గొన్నారు.

# ప్రైవేటు బస్సులపై రవాణాశాఖ కొరడా

ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన బస్సులపై రవాణాశాఖ అధికారులు కొరడా ఝుళిపించారు. సోమవారం నెల్లూరుజిల్లా ఆత్మకూరులోని ప్రైవేటు కళాశాలలు, పాఠశాలల బస్సులపై రవాణాశాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మోటారు వాహనాల ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వరరావు తనిఖీలు చేపట్టి పట్టణంలోని రవీంద్రభారతి పాఠశాలకు చెందిన బస్సును పర్మిట్ రెన్యూవల్ చేయించకోకుండా తిప్పుతున్నందున ఈ విషయం తనిఖీల్లో వెలుగుచూసింది. దీంతో బస్సును సీజ్‌చేశారు. ఆత్మకూరు ఇంజనీరింగ్ కళాశాల, సెయింట్ మేరీస్ పాఠశాలకు చెందిన బస్సులకు రికార్డులు సరిగ్గాలేనందున, కెపాసిటీకి మించి విద్యార్థులను ఎక్కించుకుని తిరుగుతున్నందున ఆ బస్సులకు జరిమానా విధించారు.

# జలదంకి ఏఎస్ఐకి ఎస్పీ క్లాస్

బాధితులకు న్యాయం చేయాల్సింది పోయి, నిందితులకు అండగా వాళ్లకు కొమ్ముకాస్తున్న పోలీసులపై నెల్లూరుజిల్లా ఎస్పీ కఠినంగా వ్యవహరిస్తూ, ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇందుకు సాక్ష్యం సోమవారం గ్రీవెన్స్‌సెల్‌లోని ఓ సంఘటన.

నెల్లూరు జిల్లా జలదంకి ఏఎస్ఐపై ఎస్పీకి బాధితులు మొరపెట్టుకున్నారు. న్యాయం చేయడం లేదని విన్నవించుకున్నారు. దీంతో ఎస్పీ తన దగ్గరకు వచ్చిన బాధితులతో నేరుగా ఏఎస్ఐకు ఫోన్‌చేయించారు. బాధితులు తమ ఫిర్యాదు విషయంపై ఏఎస్ఐను అడుగగా ఏఎస్ఐ అగ్గిమీద గుగ్గిలమై ఇష్టం వచ్చినట్లు మాట్లాడాడు. వెంటనే ఎస్పీ ఫోన్ తీసుకుని జలదంకి ఏఎస్ఐపై తీవ్రస్థాయిలో మండిపడి సరిగ్గా క్లాస్ తీసుకున్నారు. వెంటనే నిందితులపై కేసు నమోదు చేయాలని ఆదేశించారు.

# కావలి మునిసిపాలిటీకి మహర్దశ

నెల్లూరు జిల్లా కావలి మునిసిపాలిటీకి మహర్దశ రానున్నది. గ్రేడ్-1 హోదా కల్పించాలని కోరుతూ అందుకు సంబంధించిన అర్హతలతో మునిసిపల్ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. గ్రేడ్-1 హోదా ఉత్తర్వులు వస్తే వార్డుల స్వరూపంతో పాటు రాజకీయ సమీకరణలు మారనున్నాయి. కావలి పట్టణం 1967లో గ్రేడ్-3 మునిసిపాలిటీగా అవతరించింది. 1980లో గ్రేడ్-2 హోదా కల్పించాలని అధికారులు ప్రతిపాదనలు పంపారు. అయితే మునిసిపల్ ఆదాయం తక్కువగా ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించినట్లు తెలిసింది. మునిసిపాలిటీల్లో రూ.5 కోట్లు నుంచి రూ.6 కోట్లు వరకు సంవత్సర ఆదాయం ఉండే మునిసిపాలిటీలకు గ్రేడ్-1 హోదా కల్పించాలనే ప్రభుత్వ నిబంధన ఉండటంతో అప్పట్లో ఆ ప్రతిపాదనలను తిరస్కరించినట్లు తెలిసింది. ప్రస్తుతం కావలి మునిసిపాలిటీ సంవత్సర ఆదాయం రూ.6.4 కోట్లకు చేరింది. రూ.6 కోట్లకు పైన ఉంటే స్పెషల్ గ్రేడ్ మునిసిపాలిటీ అయ్యే అవకాశముంది. కావలి మునిసిపాలిటీలో మద్దూరుపాడు, బుడమగుంట, ముసునూరు పంచాయతీలు విలీనమయ్యాయి. విలీనం కాకముందు కావలి మునిసిపాలిటీలో జనాభా 82వేల 142గా వుంది. విలీనమైన తర్వాత 97 వేల 53కి పెరిగింది. విస్తీర్ణం కూడా 20.9 చదరపు కిలోమీటర్లు నుంచి 60 చదరపు కిలోమీటర్లు వరకు పెరిగింది. ప్రస్తుతం కావలి మునిసిపాలిటీలో 69,345 మంది ఓటర్లు ఉన్నారు. మునిసిపల్ వార్డులు 40ఉన్నాయి. పంచాయితీలో విలీనం కాకముందు 2011 జనవరికి ఆదాయం రూ.2.21 కోట్లు కాగా, 2012లో రూ.3.8 కోట్లు, 2013లో రూ.5.6 కోట్లు పెరిగింది. పంచాయితీలు విలీనం తర్వాత ప్రస్తుత ఆదాయం రూ.6.4 కోట్లకు చేరింది.

### చక్కని అవగాహనే

# మధుమేహానికి మందు

నెల్లూరు దర్గామిట్టలోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో ఈ నెల 20న వాకర్స్ అసోసియేషన్ అధ్వర్యంలో వాకర్స్‌కు మధుమేహంపై అవగాహన సదస్సు జరిగింది. ఎన్‌సిడి విభాగం నోడల్ ఆఫీసర్ డా॥ఈదూరు సుధాకర్ సదస్సులో పాల్గొని మాట్లాడుతూ మధుమేహం వ్యాధికాదని, జీవితకాల జీర్ణక్రియలోపం మాత్రమేనని అన్నారు. దానిని ఆహార నియమాలతో నడకతో నియంత్రించుకోవచ్చని తెలిపారు. మధుమేహ ప్రమాదం నుండి రక్షణ పొందాలంటే మధుమేహంపై అందరూ చర్చించుకోవాలని సూచించారు.

తదుపరి 91 మందికి పరగడుపున మధుమేహ రక్త పరీక్షలను హెల్త్ ఎడ్యుకేటర్స్ సునీత, రఘు, కవితలు నిర్వహించారు. కార్యక్రమంలో స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాఘవేంద్రశెట్టి, కార్యదర్శి నలుబోలు బలరామయ్య నాయుడు, కోశాధికారి స్వర్ణ రమేష్‌బాబు, రవిచంద్ర, హరికృష్ణ, షణ్ముగం, మస్తాన్ నాయుడు, ఓబుల్‌రెడ్డి, డా॥అంకిరెడ్డి, అరుణాచలం, ఎల్లారెడ్డి, గఫార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# చెరువు మరమ్మతుపై కళాజాత

సైదాపురం మండలం చీకవోలులోని పెద్దచెరువు వద్ద ఈనెల 19న కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ కళాబృందంచే చెరువుల మరమ్మతుపై కళాజాత జరిగింది. ఆంధ్రప్రదేశ్ చెరువు భాగస్వామ్య యాజమాన్య పథకం, నీటిపారుదల ఆయకట్టు అభివృద్ధిశాఖ జిల్లా సంచాలకులు జి.శ్యామసుందరం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చెరువుతల్లి నాటకం ప్రదర్శించి ప్రజలను చైతన్యపరిచారు. కేతా సుబ్బారావు, మధు, పద్మనాభం, పిరుగు సుబ్రహ్మణ్యం, అప్పజోడు నాగమణి తదితరులు జానపదనృత్యాలు, గీతాలాపన, నాటక ప్రదర్శనలతో చెరువు మరమ్మత్తులు ఎలా చేపట్టాలి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో చెరువుల పునరుద్ధరణలని ఏంచేయాలి అన్న అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీమ్‌లీడర్స్ కె.రమణయ్య, దయాకర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# నోట్‌బుక్స్ పంపిణీ చేసిన "ముస్లిం యూత్"



నెల్లూరు జెండావీధిలోని ప్రభుత్వ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు "ముస్లిం యూత్" మొహరం పర్వదినం సందర్భంగా ఈనెల 20న నోట్‌బుక్స్ పెన్సిల్స్ పంపిణీ చేసారు. స్థానిక మతపెద్ద ఎస్‌కె.బాషా ఈ సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న ముస్లింయూత్ లీడర్ ఎస్.ఖాలిద్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఎస్.నియామతుల్లా, గోల్డ్ స్మిత్, ఎస్.కె.ముఖరమ్, ఎస్.కె.మీరామొహిద్దీన్, రబ్బాని, షేక్ షాన్‌వాజ్, కంతర్, రషీద్, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఇందిరమ్మ జయంతి

నెల్లూరు మినీబైపాస్‌లోని వనంతోపు కూడలిలోగల భవాని ఫిల్లింగ్ స్టేషన్ ఆవరణలో ఈనెల 19న మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆల్ ఇండియా కాంగ్రెస్ సేవాదళ్ జాయింట్ కన్వీనర్ బి.భవాని నాగేంద్రప్రసాద్ ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడుతూ పరిపాలనా దక్షతలో, సంక్షేమ పథకాల అమలులో ఇందిరాగాంధీ అగ్రగణ్యులుగా ప్రపంచస్థాయి కీర్తి ప్రతిష్టలను పొందారన్నారు. మహిళాలోకానికి, రాజకీయరంగానికి ఆమె ధృవతారగా నిలిచారన్నారు.

అదేరోజు భవాని నాగేంద్రప్రసాద్ తండ్రి రిటైర్డ్ సబ్ రిజిస్ట్రార్ స్వర్గీయ బొక్కసం యానాదయ్య 72వ జయంతి కావడంతో నెల్లూరు వేదాయపాళెంలోని అయ్యప్పగుడి సమీపంలో గల ప్రగతి ఛారిటీస్ మూగ, చెవిటి విద్యార్థుల వసతి గృహంలోని 200మంది విద్యార్థులకు ఆయన అన్నదానం చేసారు. కార్యక్రమంలో దగ్గుపాటి రాధాకృష్ణ, దేవరాల సుబ్రహ్మణ్యం, పేరం సుందరరామిరెడ్డి, పాముూరు జయరమేష్‌రెడ్డి, జి.బాబురావు, బీరంగుంట శ్రీనివాసులు, సర్వేపల్లి ప్రభాకరరావు, డి.కోటేశ్వరరావు, కీర్తి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

### ఝాన్సీ లక్ష్మీభాయ్ జీవితాన్ని

# మహిళలు ఆదర్శంగా తీసుకోవాలి

బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన వీరనారి ఝాన్సీలక్ష్మీబాయ్ జీవితాన్ని మహిళలందరూ ఆదర్శంగా తీసుకోవాలని, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా నేటి మహిళలు ఆమె అడుగుజాడల్లో నడవాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవిపి) విభాగ్ సంఘటన కార్యదర్శి ఈశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం నెల్లూరు డికెడబ్ల్యూ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వసతి గృహ సమావేశ మందిరంలో ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి వేడుకలు ఏబీవిపి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా డికెడబ్ల్యూ కళాశాల అధ్యాపకురాలు ఆదిశేషమ్మ మాట్లాడుతూ ఝాన్సీలక్ష్మీబాయ్ జయంతిని అన్ని విద్యాసంస్థల్లో నిర్వహించాలన్నారు.

ఈకార్యక్రమంలో నగర సంఘటనా కార్యదర్శి రాఘవేంద్ర, నరేంద్ర, చంద్రకాంత్, వెంకటేష్, మస్తాన్‌రెడ్డి, సుధారాణి, అశ్విని, భవాని, రాణి తదితరులు పాల్గొన్నారు.

# తహశీల్దార్ కార్యాలయాల్లో 'మీసేవ'లు బంద్

నెల్లూరు జిల్లాలోని తహశీల్దార్ కార్యాలయాల్లో గత ఏడాది ఏర్పాటు చేసిన మీసేవ కేంద్రాలను రద్దు చేసి వాటి స్థానంలో ఏపి ఆన్ లైన్ ద్వారా సేవలు అందించేలా జిల్లా కలెక్టరేట్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. తహశీల్దార్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన మీసేవ కేంద్రాల్లో ఆపరేటర్లకు పని ఒత్తిడి పెరగడం, వారి జీతభత్యాల ఖర్చులు పెరగడంతో ఈమేరకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది. మీసేవలను తహశీల్దార్ కార్యాలయాల సమీపంలోనే ఏపి ఆన్‌లైన్ ద్వారా సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మొత్తం 46 మండలాల్లోని తహశీల్దార్ కార్యాలయాల్లో వీటిని అమలు చేపడుతున్నారు. డిసెంబర్ నెలాఖరులోగా ఈ ప్రక్రియ జరగనుంది.

PDF Compressor Free Version





ఈ నెల 16వ తేదీ నెల్లూరు బారాషహీద్ దర్గా వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్న రాష్ట్ర ఆర్థికశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రాష్ట్ర మైనార్టీసంక్షేమశాఖామంత్రి అహ్మదుల్లా, డిసిసిబి ఛైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, డీసీయంయస్ ఛైర్మన్ వై.సుమంత్‌రెడ్డి తదితరులు.

# విజయవంతం చేసారు

ఆనం అభినందనలు




నెల్లూరుకే అంతర్జాతీయంగా గుర్తింపుతెచ్చిన బారా షహీద్ దర్గా రొట్టెల పండుగను విజయవంతం చేసిన అధికారులు, సిబ్బందిని నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి అభినందించారు. 18వ తేదీ దర్గా ప్రాంగణంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారీవర్షాలు కురిసినా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు రాకుండా అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసారన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు, అపరిశుభ్రత లేకుండా మున్సిపల్ సిబ్బంది బాగా పనిచేసారన్నారు. అన్ని శాఖలవాళ్లు కూడా ఎవరి విధులు వాళ్ళు సమర్థవంతంగా నిర్వహించబట్టే భక్తుల మన్ననలు పొందేలా రొట్టెలపండుగను విజయవంతం చేయగలిగామన్నారు. ఈ సందర్భంగా నగర డీఎస్పీ వెంకటనాథ్‌రెడ్డి, నగర పాలకసంస్థ కమీషనర్ శ్యాంసన్‌లతో పాటూ అన్నిశాఖల అధికారులను ఎమ్మెల్యే శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు.

# నెల్లూరులో శిక్షణకు వచ్చిన డీఎస్పీలు

నెల్లూరుజిల్లాలో ఆరునెలల పాటు శిక్షణ పూర్తిచేసుకునేందుకు ముగ్గురు ట్రైనీ డీఎస్పీలు ఈ నెల 18న నెల్లూరు వచ్చారు. జిల్లా ఎస్పీ పివియస్ రామకృష్ణ వద్ద వీరు రిపోర్టు చేసుకున్నారు. వీరిలో తూర్పుగోదావరి జిల్లా కాకినాడకు చెందిన టీ.ప్రభాకర్‌బాబు, అనంతపురంకు చెందిన ఆర్.రాఘవేంద్ర, జె.కులశేఖర్‌లు ఉన్నారు. పోలీసు విధులపై శిక్షణ, స్టేషన్లలో పనిపై అవగాహన పెంపొందించుకునేందుకు వీరికి పోలీసుస్టేషన్లు కేటాయించారు. సైదాపురంలో టీ.ప్రభాకర్‌బాబు వరికుంటపాడులో ఆర్.రాఘవేంద్ర, కలువాయిలో జె.కులశేఖర్ శిక్షణలో భాగంగా విధులు నిర్వర్తించనున్నారు. నెల్లూరులో ఎస్పీ నిర్వహించిన గ్రీవెన్స్‌డే కార్యక్రమాన్ని వీరు పరిశీలించారు.

# సింహపురి చిన్నారులకు "నృత్యచంద్రిక" అవార్డులు



మండలి బుద్ధప్రసాద్ చేతులమీదుగా అవార్డులందుకుంటున్న చిన్నారులు

బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ వైష్ణవీ థియేటర్స్ ఆధ్వర్యంలో ఇటీవల చిక్కడపల్లి త్యాగరాజ సభలో సింహపురికి చెందిన శ్రీగురుకృప కళాక్షేత్రం విద్యార్థినులు సురభి సాహిత్య, జాహ్నవికి 'నృత్య చంద్రిక'అవార్డులు అందజేసినట్లు కళాక్షేత్రం అధినేత్రి సురభి గాయత్రి తెలిపారు. ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డులను చిన్నారులకు రాష్ట్ర సాంస్కృతికశాఖ ఛైర్మన్ మండలి బుద్ధప్రసాద్, నర్తకి స్వాతిసోమనాథ్, సినీనటులు రాళ్ళపల్లి చేతుల మీదుగా అందుకున్నారని తెలిపారు.

# రైల్వేస్టేషన్‌కు సొకులు

నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ లోపల అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రాత్రివేళ కొన్ని రైళ్లు మాత్రమే ఆగే ఒకటో నెంబర్ ప్లాట్‌ఫారంను పొడిగించారు. ఈ ప్లాట్‌ఫారంపై షెల్టర్‌లు, బెంచీలు, తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే విజయవాడ రైల్వేస్టేషన్‌లో మాదిరిగా ఇక్కడా ఎక్సలేటర్‌ను ఏర్పాటు చేయబోతున్నారు. దీనివల్ల వృద్ధులకు, మోకాళ్ల నొప్పులున్న వారికి మెట్లు ఎక్కే శ్రమ తప్పుతుంది. అలాగే రైల్వేస్టేషన్ ప్రధాన ద్వారాలకు కూడా రంగులు వేసి అలంకరణ చేస్తున్నారు. రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయేగాని, వాటి నిర్వహణ అధ్వాన్నంగా వుంటుంది. ఈ స్టేషన్‌లో మెట్లెక్కలేని ప్రయాణీకుల కోసం చాలాకాలం క్రితమే లిఫ్ట్ ఏర్పాటు చేసారు. కాని అది పనిచేస్తుందోలేదో కూడా ఎవ్వరికీ తెలీదు. సౌకర్యాలు కల్పించడం కాదు, వాటిని ఉపయోగించుకునేట్లు చేయాలి.

# నెల్లూరు కబుర్లు

## జిల్లాలో సీఎం, మంత్రులు

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి 20వ తేదీ తడ మండలంలోని శ్రీసిటీకి వచ్చారు. ఈ సెజ్‌లో ఇప్పటికే పూర్తయ్యి, ఉత్పత్తులు మొదలుపెట్టిన 13పరిశ్రమలను, అలాగే నిర్మాణదశలో వున్న 15పరిశ్రమలను జాతికి అంకితం చేసారు. మరో 10 పరిశ్రమలకు భూమిపూజ నిర్వహించారు. శ్రీసిటీ పర్యటన పూర్తయ్యాక ఆయన చిత్తూరుజిల్లాకు బయల్దేరివెళ్లారు.

అలాగే రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పితాని సత్యనారాయణ 19వ తేదీ జిల్లాకు వచ్చారు. తడ మరియు సూళ్లూరుపేటలలో జరిగిన రచ్చబండ కార్యక్రమాలలో రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో కలిసి పాల్గొన్నారు.

## శాస్త్ర ప్రదర్శనలతో సృజనాత్మకత



నమూనాలతో విద్యార్థులు

శాస్త్ర ప్రదర్శనలతో విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీయవచ్చని డాక్టర్ కిషోర్స్ రత్నం స్కూల్ జనరల్ మేనేజర్ రామ్మూర్తి నాయుడు పేర్కొన్నారు. నెల్లూరు సరస్వతినగర్ లోని డాక్టర్ కిషోర్స్‌రత్నం, సి.వీ.రామన్ ఇంగ్లీషు మీడియం స్కూల్లో సైన్స్‌మ్యానిఫెస్టో పేరుతో ఇటీవల సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు 130 నమూనాలను ప్రదర్శించి తమ ప్రతిభను చూపారని కొనియాడారు. మాగుంటలేఅవుట్‌లోని డాక్టర్ కిషోర్స్‌రత్నం స్కూలులో దిసైన్స్ ఫెస్టివిటీ-2013 పేరుతో విద్యార్థులు నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను స్కూల్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణకిషోర్ ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థులు తాము చదువుకుంటున్న పాఠ్యాంశాలకు అనుగుణంగా పర్యావరణ పరిస్థితులపై నమూనాలను ప్రదర్శించడం అభినందనీయనన్నారు. డైరెక్టర్ వాసంతి, ప్రిన్సిపాల్ గీత, అడ్మినిస్ట్రేటర్ రాధాకృష్ణ, ప్రపూర్ణ, కో ఆర్డినేటర్ షాలేమ్‌రాజ్, ప్రధానోపాధ్యాయురాలు సుప్రియారెడ్డి, మేనేజర్ కమల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## రొట్టెల పండుగలో సిఎంఆర్ సేవలు



భక్తులకు పులిహోర పొట్లాలు అందిస్తున్న సిఎంఆర్ సిబ్బంది

నెల్లూరు బారా షాహిద్ దర్గాలో జరుగుతున్న రొట్టెల పండుగకు వచ్చిన భక్తులకు సిఎంఆర్ షాపింగ్ మాల్, చందన బ్రదర్స్ ఆధ్వర్యంలో మూడురోజుల పాటూ రెండు కౌంటర్ల ద్వారా రెండు లక్షల వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేసినట్లు సిఎంఆర్ అధినేత మావూరి శ్రీనివాసరావు తెలిపారు. 16వ తేదీ రొట్టెల పండుగకు వచ్చిన భక్తులకు పదివేల పులిహోర ప్యాకెట్లు, అయిదు వేల బిస్కెటు ప్యాకెట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.

## లయకారునికి స్వరనీరాజనం



నాదప్రియుడు, నాద మయుడు, లయకారుడు అయిన పరమేశ్వరునికి సంగీత కళాకారులు స్వరనీరాజనం అర్పించారు. నెల్లూరు దర్గామిట్ట రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల ఆధ్వర్యంలో ఫణికుమారి, జయలక్ష్మి, రాజ్యలక్ష్మి తమ వీణాత్రయంతో అలరించారు.

అనంతరం సర్వేపల్లి శ్రేయ ఆలపించిన సంకీర్తనలు ఆద్యంతం రసరమ్యంగా సాగాయి. వీరికి మృదంగం అమ్ముల ప్రసాద్, పినాకపాణి, వయోలిన్, యం.లోకేష్ కంజీరపై శాంతికళాధర్‌లు సహకార మందించారు. పాఠశాల ప్రిన్సిపల్ సి.మునికుమార్ మాట్లాడుతూ కార్తీక మాసంలో ప్రతి సంవత్సరం నృత్యోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఆ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి పాయసం నాగేశ్వరరావు. డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్, బి.వి.నరసింహ, భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమ వ్యాఖ్యాతగా పెరుగు సుజనారామం వ్యవహరించారు.

## ఆగిన ప్రైవేట్‌బస్సులు

మొన్నటిదాకా రవాణాశాఖాధికారుల దాడులతో ప్రైవేట్ ట్రావెల్స్‌వారు బస్సులను ఆపేసారు. మంగళవారం రాత్రి నుండి మూడు నెలలకోసారి చెల్లించే పన్నును పెంచారని నిలిపేసారు. దీంతో వేలసంఖ్యలో వున్న ప్రయాణీకులు చాలా ఇబ్బందిపడ్డారు. నెల్లూరు నుండి హైదరాబాద్, బెంగుళూరుకు ప్రతిరోజూ 50కి పైగానే ఏసి, నాన్‌ఏసి బస్సులు వెళ్తుంటాయి. ప్రతి మూడునెలలకు ఓసారి రవాణాశాఖకు వాహన పన్ను చెల్లిస్తుంటారు. అయితే ఇప్పటికే చెల్లిస్తున్న పన్నులపై అదనంగా మరో 40వేల రూపాయల పన్ను పెంచారు. దీంతో అన్ని ట్రావెల్స్ యాజమాన్యాలు బస్సులను నిలిపేయాలని నిర్ణయించాయి. హైదరాబాద్, బెంగుళూరులకు వెళ్లే ప్రయాణీకులు లగేజీలు సర్దుకుని బస్సుల వద్దకు వచ్చేసరికి ట్రావెల్స్ వాళ్లు బస్సులు పోవడం లేదని చెప్పడంతో ఇబ్బందులుపడ్డారు.

## జిల్లాలో భారీ వర్షాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో నెల్లూరు జిల్లాలో శని, ఆదివారాల్లో భారీ వర్షాలు కురిసాయి. వాయుగుండం 16వ తేదీ రాత్రి తమిళనాడులోని కడలూరు, నాగపట్నం మధ్య తీరం దాటింది. దీని ప్రభావంతో జిల్లాలో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురిసాయి. నెల్లూరు జిల్లాలో సగటున 44.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా వాకాడు మండలంలో 10.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. కాగా వరికుంటపాడులో వర్షం కనపడలేదు. సీతారామపురం, కొండాపురంలో అత్యల్ప వర్షపాతం నమోదైంది.

## ఏఆర్ ఎస్సై రఫీకి ఎస్పీ అభినందన

నెల్లూరు బాంబ్ డిస్పోజల్ టీమ్ ఏఆర్ ఎస్సై ఎండీ రఫీని జిల్లా ఎస్పీ పివియస్ రామకృష్ణ సోమవారం అభినందించారు. గత నెల21 నుండి ఈ నెల 11వ తేదీ వరకు హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెన్స్ ట్రైనింగ్ అకాడమీలో అన్ని జిల్లాల బాంబ్ డిస్పోజల్ టీమ్ సిబ్బందికి నేషనల్ సెక్యూరిటీ గార్డ్ సిబ్బంది శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో ఏఆర్ ఎస్సై రఫీ ఉత్తమ ప్రతిభ కనపరిచి రాష్ట్ర స్థాయిలో బాంబు డిటెక్షన్ అండ్ డిస్పోజల్ విభాగంలో మూడవ బహుమతి సాధించారు. దీంతో ఎస్పీ రామకృష్ణ ఆయన్ను అభినందించారు.

## పరమేశ్వరునికి వెండిబిందె బహుకరణ

నెల్లూరు మూలాపేటలోని శ్రీ భువనేశ్వరీ సమేత శ్రీ మూలస్థానేశ్వరస్వామికి శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయ మాజీఛైర్మన్ సూరిశెట్టి నరేంద్ర వెండిబిందెను బహుకరించారు. సోమవారం రాత్రి ఎమ్మెల్యేలు ఆనం వివేకానందరెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డికి నరేంద్ర కుటుంబసభ్యులు అందజేశారు. స్వామివారికి జరిగే అభిషేకాలకు ఈ బిందెను వినియోగిస్తామని ఇఓ తెలిపారు. దీని విలువ సుమారు రూ.71వేలు వుంటుందని పరమేశ్వరునికి వెండిబిందె బహుకరించడం సంతోషదాయకమని ఎమ్మెల్యేలు అన్నారు.

PDF Compressor Free Version



సింహపురి సమాచారం

# రాయలపౌరుషం ఏమైంది

## -- సోమిరెడ్డి --



రాయలతెలంగాణ అంటున్న జేసీ దివాకర్‌రెడ్డికి రాయలసీమ పౌరుషం లేకుండాపోయిందని తెలుగుదేశంపార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. రాయలతెలంగాణ ప్రతిపాదనే అర్థరహితమన్నారు. ఈ నెల 18వ తేదీన నెల్లూరులోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జె.సి.దివాకర్‌రెడ్డి, కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి వంటి వాళ్ళు తమ స్వార్థ రాజకీయ, వ్యాపార ప్రయోజనాల కోసమే రాయలతెలంగాణ అంటున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లో పాతబస్తీకే పరిమితమై, రాయలసీమలో ఒక వార్డుమెంబర్ కూడా లేని ఎంఐఎం రాయల తెలంగాణ గురించి మాట్లాడడం శోచనీయమన్నారు. రాయలతెలంగాణ ప్రకటిస్తే నెల్లూరు, కడప, ప్రకాశం, చిత్తూరుజిల్లాలలో లక్షలాది ఎకరాల ఆయకట్టును ఎండబెట్టుకోవాల్సి వస్తుందన్నారు. రాయలతెలంగాణ ప్రస్తావన తెస్తే ఈ జిల్లాల ప్రజలు తీవ్రస్థాయిలో ఉద్యమిస్తారని ఆయన హెచ్చరించారు.

కాంగ్రెస్‌పార్టీ ఓట్లు, సీట్ల కోసమే రాష్ట్రాన్ని విభజిస్తుంది. మొన్నటివరకు సమైక్యాంధ్రకు మద్దతు పలికిన జైపాల్‌రెడ్డి లాంటి పెద్దమనుషులు ఈరోజు సీమాంధ్రకు అన్యాయం చేసేలా మాట్లాడడం పెద్ద దుర్మార్గం. మరో మూడు నెలల్లో కేంద్రంలో యూపీఏకు, రాష్ట్రంలో కాంగ్రెస్‌కు సమాధి కట్టడానికి ప్రజలు సిద్ధంగావున్నారు. ఇంత లోపే ఇంత దుర్మార్గానికి పాల్పడాలా? అని ఆయన ప్రశ్నించారు. స్టార్‌బ్యాట్స్‌మెన్ వచ్చి విభజనను అడ్డుకుంటాడని లగడపాటి రాజగోపాల్ పదేపదే అంటున్నాడని, ఇల్లు కాలి బూడిదయ్యాక ఫైరింజన్ వచ్చినట్లుగా రాష్ట్ర విభజన తంతు ముగిసాక ఆ స్టార్ బ్యాట్స్‌మెన్ వస్తాడా అని ఎద్దేవాచేసారు. సీమాంధ్ర కేంద్ర రాష్ట్రమంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు రాజీనామాలు చేసి రాజకీయ సంక్షోభం సృష్టించనిదే విభజనను అడ్డుకోలేరన్నారు.

ఈ సమావేశంలో తెలుగుదేశం నాయకులు యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, మున్వర్, ధర్మవరం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# మీకు మానవత్వం లేదా?

## :: ప్రభుత్వాసుపత్రి డాక్టర్లపై ఆగ్రహించిన కలెక్టర్ ::



నెల్లూరు జిల్లా వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద ఈనెల16న తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ క్షతగాత్రులకు చికిత్స అందించే విషయంలో నిర్లక్ష్యం చూపిన డ్యూటీ డాక్టర్లు, సిబ్బందిపై జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ తీవ్రంగా ఆగ్రహించారు. మీకు జీతాలు ఇస్తున్నది పేదలకు వైద్యం చేసేందుకే నని, రోజూ ఆస్పత్రికి వచ్చి కాలు మీద కాలేసుకుని కూర్చోవడానికి కాదని, పద్ధతి మార్చుకోవాలని మండిపడ్డారు. వైద్యుల నిర్లక్ష్యంపై ఆర్డీవోతో విచారణ చేయిస్తున్నట్లు ప్రకటించారు.

వివరాల్లోకి వెళ్ళితే కడప జిల్లా రాయచోటి కొత్తపాళేనికి చెందిన షేక్‌సాహెబ్‌పీరా తమ కుటుంబ సభ్యులతో కలసి నెల్లూరులో జరిగే రొట్టెల పండుగకు వస్తూ నెల్లూరు జిల్లా వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద 16వ తేదీ తెల్లవారుజామున ప్రమాదానికి గురయ్యారు. సుమోలో ముందుకూర్చుని వున్న నాలుగేళ్ళ చిన్నారి షమీరా, అసన్‌వలి, దర్బార్, గోషన్‌బీ, ముస్తాఫాఅలీ, డ్రైవర్ బాలరాజు అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడ్డ ఖాదర్‌వలి భార్య షంషాద్‌బేగం, కుమారులు నూర్ మహ్మద్, ఇర్ఫాన్, ఆరీఫుల్లాఖాన్, రెడ్డప్పరెడ్డిలను హైవే మొబైల్, రెండు 108 వాహనాల్లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ క్షతగాత్రులకు చికిత్స అందించే విషయంలో ప్రభుత్వాసుపత్రి డ్యూటీ డాక్టర్లు వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించి, ప్రేక్షకపాత్ర పోషించారు. క్షతగాత్రులను పరామర్శించేందుకు కలెక్టర్ శ్రీకాంత్, ఎస్పీ రామకృష్ణ, జాయింట్ కలెక్టర్ బి.లక్ష్మీకాంతం, నెల్లూరు ఆర్డీవో సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నారు.

# రైతులకు సమున్నత సేవలందిస్తాం

60వ అఖిల భారత సహకార వారోత్సవాలను పురస్కరించుకొని ఈనెల 16న నెల్లూరు జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో మార్కెటింగ్ సొసైటీ, ఇఫ్‌కో సంస్థలు సంయుక్తంగా వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ ఛైర్మన్ సుమంత్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని సహకార సంఘాలన్నింటిని సమృద్ధిపరచి రైతులకు సమున్నత సేవలందించేందుకు కృషిచేస్తామని పేర్కొన్నారు. సొసైటీల ద్వారా ఎరువులతో పాటు విత్తనాలు, పురుగు మందులను రైతులకు తక్కువ ధరకు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఇఫ్‌కో ఏరియా మేనేజర్ రవీంద్రరెడ్డి, మార్కెటింగ్ కమిటీ ఉపాధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, డీసీఓ మల్లికార్జునరెడ్డి, కోఆపరేటివ్ రిజిస్ట్రార్ తిరుపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్యాకేజీలు కోరి పరువు తీయొద్దు

సీమాంధ్ర కేంద్రమంత్రులు కేంద్రంతో బేరసారాలు కుదుర్చుకుని విభజన జరిగిపోయినట్లుగా ప్రకటనలు గుప్పించడం సిగ్గుచేటని, ఎటువంటి ప్యాకేజీలకు తలొగ్గకుండా సమైక్యాంధ్ర కోసం ఉద్యమించాలని సమైక్యాంధ్ర విద్యార్థి జేఏసి జిల్లా కన్వీనర్ డి.అంజయ్య పేర్కొన్నారు. ఢిల్లీలో మంత్రుల బృందంతో సీమాంధ్ర కేంద్రమంత్రుల భేటీ మంతనాలకు నిరసనగా మంగళవారం నెల్లూరు విక్రమసింహపురి యూనివర్సిటీ క్యాంపస్ కళాశాల ఎదుట కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ అతి సున్నితమైన రాష్ట్ర విభజన అంశంలో కేంద్ర ప్రభుత్వం నియంతలా వ్యవహరిస్తోందని విమర్శించారు.

# కోర్టుల్లో ప్రొహిబిషనరీ ఎస్సైలు

ప్రొహిబిషనరీ ఎస్సైలు మంగళవారం నుంచి కోర్టులకు హాజరయ్యారు. కోర్టు మానటరింగ్ వ్యవస్థపై వీరు శిక్షణ పొందనున్నారు. నిందితులను కోర్టులో ఏ విధంగా హాజరుపరచాలి, ఛార్జిషీటు దాఖలు, నిందితులు కేసుల నుంచి తప్పించుకోకుండా ఎలాంటి సెక్షన్లు నమోదు చేయాలి, నిందితుల తరపున న్యాయవాదులు ఎలాంటి వాదనలు విని పిస్తారు. కేసు ట్రయల్స్, కేసుల్లో తీర్పు, కేసులు ఏయే స్థాయిల్లో అపరిష్కృతంగా ఉన్నాయి, అందుకుగల కారణాలు తదితర అంశాలపై వీరు అవగాహన ఏర్పరుచుకుంటారు. వారంరోజుల పాటు వీరు గ్రహించిన అంశాలపై నివేదిక రూపొందించి ఎస్పీ పివియస్ రామకృష్ణకు అందజేయాల్సివుంది. ఈ క్రమంలో కోర్టు విధులకు వెళ్లనున్న పిఎస్సైలతో ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్‌హాలులో ఎస్పీ రామకృష్ణ సోమవారం సమావేశమయ్యారు.



ఈ నెల 20వ తేదీన తడ మండలం శ్రీసిటీలో నిర్మాణం పూర్తయిన పరిశ్రమలను ప్రారంభిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి యన్.కిరణ్‌కుమార్‌రెడ్డి, పక్కన మంత్రులు పితాని సత్యనారాయణ, గంటా శ్రీనివాసరావు, పార్థసారథి, శ్రీసిటీ ఛైర్మన్ రవి సన్నారెడ్డి

# చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



సదస్సులో ప్రసంగిస్తున్న జడ్జి చంద్రకుమార్

నెల్లూరు జిల్లా ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో ఈనెల 17న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ సీహెచ్ కనకదుర్గారావు అధ్యక్షతన జరిగిన సదస్సులో హైకోర్టు న్యాయమూర్తి జిల్లా పోర్టు పోలియో జడ్జి బి.చంద్రకుమార్ పాల్గొని మాట్లాడుతూ సమాజంలో ప్రతి వ్యక్తి శాస్త్రీయ దృక్పథాన్ని ఏర్పరచుకోవాలని, సత్యం మీదే ప్రపంచం ఆధారపడి వుందని అన్నారు. స్వార్థం కోసం సత్యం వీడకుండా, మంచి కలల సాకారాన్ని దృఢసంకల్పంతో సాధించుకోవాలన్నారు. చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి వుండాలని అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి కనకదుర్గారావు మాట్లాడుతూ యువత చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఈ సంవత్సరంలో 1064 న్యాయవిజ్ఞాన సదస్సులను నిర్వహించామని, భవిష్యత్తులో ప్రతి నెలకు రెండు న్యాయవిజ్ఞాన సదస్సులను నిర్వహించ దలిచామన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, ఎస్పీ రామకృష్ణ, అదనపు జిల్లా న్యాయమూర్తులు ఎ.జగదీష్‌చంద్రరావు, నరసింహరాజు, ఆనంద్, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.రజనీ, న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి ఎం.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కావలి అభివృద్ధికి సంపూర్ణ సహకారం



విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఆనం, పక్కన కావలి ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు

కావలి మున్సిపాల్టీ అభివృద్ధికి తన సంపూర్ణ సహకారం ఉంటుందని రాష్ట్ర ఆర్థికశాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం కావలిలో టీటీడీ కల్యాణ మండపంలో మూడోవిడత రచ్చబండ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ కావలిలో 20కోట్లతో మంచినీటి పథకాలు చేపట్టామన్నారు. కావలిలో నాలుగు పార్కుల అభివృద్ధికి నిధులు మంజూరు చేసామని చెప్పారు. కావలి కాలువకు 23కోట్లు ఖర్చుపెట్టి సాగునీరు విడుదల చేసామన్నారు. అటవీశాఖ అనుమతులు రాక కావలి కాలువ పనులు కొంత ఆలస్యమైనాయని, అనుమతులు రాగానే పనులు పూర్తి చేస్తామన్నారు. అలాగే జువ్వలదిన్నెలో 4కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కావలి అభివృద్ధికి ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావుతో పాటు ఇక్కడి కాంగ్రెస్ నాయకులు కూడా సహకరిస్తున్నారని అభినందించారు. మున్సిపల్‌శాఖ మంత్రి మానుగుంట మహీధర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో కావలి మున్సిపాల్టీకి 2కోట్ల ఆదాయం వుండేదని, ఇప్పుడు అది 5కోట్లకు పెరిగిందన్నారు. ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ 4సంవత్సరాల పదవీకాలంలో నియోజకవర్గానికి 52కోట్ల రూపాయలు తెచ్చి అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేనయినా అధికారపార్టీ ఎమ్మెల్యేలకంటే ఎక్కువ పనులు చేయగలిగానని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, ఆర్డీఓ వెంకటరమణారెడ్డి, నాయకులు చెంచలబాబుయాదవ్, డి.వి.కృష్ణారెడ్డి, దామిశెట్టి శ్రీనివాసులునాయుడు, గ్రంధి యానాదిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

# ఫుట్‌బాల్ పోటీల్లో నెల్లూరుకు మూడవస్థానం

42వ రాష్ట్రస్థాయి సీనియర్ ఫుట్‌బాల్ టోర్నమెంటు అదిలాబాద్ జిల్లా రామకృష్ణాపూర్ సింగరేణి టాగూర్ స్టేడియంలో నాలుగురోజులపాటు జరిగింది. ఈ టోర్నమెంటులో రాష్ట్రవ్యాప్తంగా 21జిల్లాలకు చెందిన జట్లు పాల్గొన్నాయి. సోమవారం జరిగిన ఫైనల్ పోటీలో రంగారెడ్డి జట్టు విశాఖపట్టణం జట్టుపై 1-0గోల్‌తో గెలుపొందింది. విశాఖపట్టణం రెండవస్థానంలో నిలువగా నెల్లూరు మూడవస్థానంలో నిలిచింది. విజేతలకు ఎమ్మెల్సీ బి.వెంకట్రావు, ఏఐటీయూసి నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి ఫాల్గుణ, నిర్వాహక కమిటి కన్వీనర్ ఎస్ఐ ఐన్నీ లాల్‌లు బహుమతులందజేశారు.

అమ్మ ఫర్నిచర్ మాల్
మినిబైపాస్‌రోడ్, నెల్లూరు.
• సరికొత్త ప్రపంచస్థాయి మోడల్స్
• ఇంపోర్టెడ్ & ఇండియా ఫర్నిచర్
ఫైనాన్స్ సదుపాయము. ఆదివారం షాపు గలదు.

# రాష్ట్రంలో ఇద్దరు చంద్రుళ్ళు

శ్రీను గల్పిక

జరిగిన కథ :- రెండుకళ్ల సిద్ధాంతంతో సతమత మైపోతున్న చంద్రబాబు వద్దకు స్టైల్ ఆఫ్ సింహపురి అనం వివేకా(63) వస్తాడు. చంద్రబాబు సమస్యను విని ఆయనను వివేకా తన వెంట అమెరికాకు తీసుకుపోతాడు. తర్వాత కరీంనగర్‌లో జరిగిన తెలంగాణ సభలోనూ, విజయవాడలో జరిగిన సమైక్యాంధ్ర సభలోనూ చంద్రబాబు ఒకేసారి మాట్లాడి ఆశ్చర్యంలో ముంచెత్తుతాడు. అలాగే జీవోఎంకు తెలంగాణకు అనుకూలంగా, సమైక్యాంధ్రకు అనుకూలంగా నివేదికలిస్తారు. చంద్రబాబు ఒకడే వచ్చి రెండు వేర్వేరు నివేదికలిచ్చాడో లేక ఇద్దరు చంద్రబాబులున్నారో అర్థంకాక కేంద్రమంత్రి ఆంటోని అయోమయంలో పడతాడు. ఆ తర్వాత...

మర్నాడు పత్రికల్లో తెలంగాణకు అనుకూలంగా లేఖ ఇచ్చిన చంద్రబాబు అంటూ తెలంగాణలోని అన్ని పత్రికలలో వార్తలొచ్చాయి. దాంతో అక్కడి తెలుగుదేశం నాయకులందరూ ఊరూరా సభలు పెట్టి ప్రత్యేకతెలంగాణ ఘనత మా పార్టీదేనని ప్రచారం చేసుకోసాగారు. అదే రోజు సమైక్యాంధ్ర కోరుతూ జీఓఎంకు లేఖ ఇచ్చిన చంద్రబాబు అని సీమాంధ్ర లోని పత్రికలు వ్రాయడంతో ఇక్కడి నేతలు కూడా ప్రతి ఊర్లో సభ పెట్టి మా నాయకుడు సమైక్యవాది అంటూ డబ్బా కొట్టుకోసాగారు. రెండుచోట్లా ఈ పరిస్థితి చూసి సీఎం కిరణ్, ఇతర మంత్రులు, టీఆర్ఎస్, వైయస్సార్ కాంగ్రెస్ నేతలు విస్తుపోసాగారు. నిన్నటిదాకా చంద్రబాబు రెండుకళ్ల సిద్ధాంతంతో మభ్యపెట్టాడు. ఇప్పుడు డబుల్‌యాక్షన్ డ్రామాతో మోసం చేస్తున్నాడని, ఇందులో ఏదో కిరికిరి వుందనుకోసాగారు.

★★★★★

అది చంద్రబాబు నివాసం. ఆరోజు పత్రికలలో వచ్చిన వార్తలను చూస్తున్నాడు. అటు సీమాంధ్రలో, ఇటు తెలంగాణలో రెండుచోట్లా తనకు ఇమేజ్ పెరుగుతుండడం చూసి ఆయన తెగ సంబరప డిపోయాడు. వివేకా ఇచ్చిన ప్లాన్ భలే వర్కవుట్ అయ్యిందనుకుంటూ మనసులోనే ఆయనకు కృతజ్ఞతలు తెలుపుకున్నాడు.

★★★★★

అది హైదరాబాద్‌లోని హెరిటేజ్ ప్రధాన కార్యాలయం. అప్పుడే చంద్రబాబు లోపలకు వచ్చాడు. నిన్నటివరకు జరిగిన వ్యాపారం కలెక్షన్ ఎంతుందని అకౌంటెంట్‌ని అడిగాడు. 50లక్షల దాకా వుందని అతను చెప్పాడు. వెంటనే ఓ సూట్‌కేసులో సర్దివ్వు అని చంద్రబాబు చెప్పాడు. చంద్రబాబు ఏరోజూ ఇలా వచ్చి కలెక్షన్ తీసుకోలేదని ఆ అకౌంటెంట్ అనుకుంటూనే ఏం అవసరమొచ్చిందోలే అనుకుని మొత్తం క్యాష్‌నంతా సూట్‌కేసులో పెట్టి ఇచ్చేసాడు. వెంటనే చంద్రబాబు వెళ్లిపోయాడు. మరో 10నిముషాలకు హెరిటేజ్ కార్యాలయానికి ఒరిజినల్ చంద్రబాబు వచ్చాడు. ఇంతలోకే మళ్లీ వచ్చారేం సార్ అని అకౌంటెంట్ అడిగాడు. ఇంతలోకే రావడం ఏంటి... నేనిప్పుడే కదా వస్తున్నానని చంద్రబాబు అన్నాడు. ఆ మాటకు అకౌంటెంట్ షాకై... మీరిప్పుడు రావడం ఏంటి సార్... ఇంతకుముందే కదా వచ్చి నిన్నటిదాకా వచ్చిన 50లక్షల కలెక్షన్ పట్టుకెళ్లారు అని చెప్పాడు. ఆ మాటకు ఈసారి చంద్రబాబు షాకయ్యాడు. ఆయనకు జరిగిన విషయం ఒక్క నిముషంలోనే అర్థమైంది. ఇప్పుడే వస్తానుండండంటూ పార్టీ ఆఫీసుకు పరుగు మొదలుపెట్టాడు.

★★★★★

అది ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్. చంద్రబాబు తన సీట్లో కూర్చుని వున్నాడు. అప్పుడే తెలంగాణ నేతలు ఎర్రబెల్లి దయాకర్‌రావు, రేవంత్‌రెడ్డి, మోత్కుపల్లి నరసింహులు, ఉమామాధవరెడ్డి వంటి నాయకులొచ్చారు. ఎర్రబెల్లి దయాకర్‌రావు వుండి... మీరు తెలంగాణకు సంపూర్ణంగా మద్దతు పలికినందుకు చాలా సంతోషంగా వుంది సార్. మీ ప్రకటనతో తెలంగాణలో మన పార్టీ బ్రహ్మాండంగా బలం పుంజుకుంది. ఇక తెలంగాణలో మనకు తిరుగులేదన్నాడు. ఆ మాటకు చంద్రబాబు... నీ మొహం... నేను తెలంగాణకు సంపూర్ణమద్దతు పలకడం ఏంటి... నాది సీమాంధ్ర రోల్. నేను పక్కా సమైక్యవాదిని అని అన్నాడు. ఆ మాటతో రేవంత్‌రెడ్డికి మండింది. మీది రెండుకళ్ల సిద్ధాంతమనుకున్నానే గాని రెండు నాలుకల సిద్ధాంతమనుకోలేదు. నిన్న తెలంగాణకు అను కూలంగా జీఓఎంకు లేఖ ఇచ్చి ఈరోజు మాట మారుస్తారా... ఇలా అయితే మేం పార్టీలో వుండం అని హెచ్చరించాడు. దానికి చంద్రబాబు... ఉంటే వుండండి, పోతే పోండి, అసలు మిమ్మల్నెవరు వుండ మన్నారు. ఏ 50కోట్లో ఇస్తే నేనే కాంగ్రెస్‌లోకో, వైయస్సార్ కాంగ్రెస్‌లోకో పోవాలనుకుంటున్నాను. మీరు కూడా అలాంటి పార్టీలేవన్నా వుంటే వెదుక్కోండి అని చెప్పాడు. ఆ మాటలతో తెలంగాణ నాయకులకు తల తిరిగినంత పనైంది. ఛీఛీ ఇలాంటి నాయకుడి దగ్గరా ఇంతకాలం పనిచేసింది అని అనుకుంటూ వెనుతిరిగారు. అక్కడే వాకిట్లో వారికి ఇంకో చంద్ర బాబు ఆయాసపడుతూ కనిపించాడు. ఇది వాళ్లకు మరో షాక్ అయ్యింది.

రేవంత్‌రెడ్డి షాక్ నుండి తేరుకుని... ఏంటి సార్ మాకీ పరీక్ష. ఈ డబుల్‌యాక్షన్ ఏమిటి... అసలు మీరిద్దరు ఎలా వచ్చారు. ఇంతకీ ఒరిజినల్ ఎవరు? అని ప్రశ్నించాడు. దానికి ఎదురుగా వచ్చిన చంద్రబాబు... నేనే ఒరిజినల్ చంద్రబాబును... వాడు డూప్... అసలు జరిగిందేమిటంటే సీమాంధ్ర, తెలంగాణ విషయాల్లో రెండుకళ్ల సిద్ధాంతం పని చేయక సతమతమవుతూ వివేకాను సలహా అడిగాను. అతను నన్ను అమెరికాకు తీసుకెళ్లి క్లోనింగ్ ద్వారా అచ్చం నాలాగే వుండే చంద్రబాబును సృష్టించారు. ఒరిజినల్‌నైన నేను తెలంగాణకు అనుకూలంగా మాట్లాడాలనుకుని క్లోనింగ్ చంద్రబాబుకు సమైక్యాంధ్రవాదిగా శిక్షణనిప్పించాం. మొదట క్లోనింగ్ చంద్రబాబు డ్యూటీ బాగానే చేసాడు. కాని క్రమంగా ఇక్కడ డబ్బు రాజకీయాలకు అలవాటుపడ్డాడు. నా రూపంలో వుండడంతో హెరిటేజ్‌కెళ్లి అక్కడ కలెక్షన్‌ను తీసుకున్నాడు. వైకాపాలో చేరుతానని ఆ పార్టీ వారితో బేరం కుదుర్చుకున్నాడు. చంద్రబాబే పార్టీని మూసేసి వస్తున్నాడంటే వాళ్లు చేర్చుకోరా... బాధ్యత లేదుకాబట్టే మీతో బాధ్యతారాహిత్యంగా మాట్లాడాడు. ఇంతవరకు నయం రేపు హత్యలు, దోపిడీలు చేసి ఆ నేరాలు నా మీద వేస్తే నా బ్రతుకేం కావాలి. అందుకే ఈ క్లోనింగ్ చంద్రబాబును మళ్ళీ అమెరికాకు తీసుకెళ్లి అక్కడే నిర్వీర్యం చేయాలనుకుంటున్నాను. ఈ విషయం బయటకు తెలియనివ్వవద్దు... అని చెప్పాడు. అప్పుడు తెలంగాణ నేతలు ఓ... అదా విషయం, అనవసరంగా మిమ్మల్ని అపార్థం చేసుకుని ఇంకో పార్టీలో చేరదామని ఆలోచిస్తున్నాం సార్... సారీ అంటూ ఇంటిబాట పట్టారు.

## కదంబం

### రేపటి ఎన్నికల్లో...

# నిన్ను చంపి తీరుతుంది

డా॥ రావి రంగారావు,
మచిలీపట్నం, 92475 81825

తుపాకీ నీదే
బుల్లెట్టూ నీదే
"రెండూ నా స్వాధీనంలోనే" అనుకుంటావు,
ఓ సారి బుల్లెట్ వదిలి చూడు
నువ్వు ఆగమన్నా ఆగదు...
వెనక్కి తిరిగి రమ్మన్నా రాదు...
దూసుకుపోయి లక్ష్యం గుండె ఛేదిస్తుంది,
ఒక ప్రాణాన్ని హింసించినందుకు
సిగ్గుపడి ఆత్మహత్య చేసుకుంటుంది...
నీకు సిగ్గా, ఎగ్గా!
తుపాకీ పేలుస్తూనే ఉంటావు...

నీ తుపాకీలోని బుల్లెట్ల కన్నా
నీ నోట్లోంచి వస్తున్న మాటలే మరీ ప్రమాదం ఇప్పుడు,
అధికార "కేంద్రం"లో ఉండి
నువ్వు వదులుతున్న మాటలు
ఎన్ని ప్రాంతాల అంతరంగాల్ని చీలుస్తున్నాయో నీకు బాగా తెలుసు...

బుల్లెట్ వదిలితే అది గుండెను చీల్చి అంతటితో అంతరిస్తుంది,
నువ్వు వదిలే మాటలు అలా కాదు
జనం గుండెల్ని చీల్చి అంతటితో అంతరించవు,
ప్రజల అదృశ్య శక్తిగా, నీపై పగ తీర్చుకొనే యుక్తిగా
ప్రతి మాటా తిరిగొచ్చే బుల్లెట్‌గా మారుతుంది,
ప్రజల హృదయాల్లోంచి నీ గుండెల్లోకి కసిగా దూరుతుంది..

బుల్లెట్ నిన్ను క్షమించి చచ్చిపోతుంది,
కాని నువ్వు వదిలే ప్రతి మాట ప్రతీకారంతో
రేపటి ఎన్నికల్లో నిన్ను చంపే తీరుతుంది.

### పినాకిని యూత్ ఆధ్వర్యంలో

# ఇందిరాగాంధీ జయంతి



నెల్లూరు కొండాయపాళెం దళితవాడలోని నగరపాలక పాఠమిక పాఠశాలలో ఈనెల 19న ఇందిరాగాంధీ జయంతి పురస్కరించుకొని పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు జరిగాయి. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు కె.మురళీమోహన్‌రాజు, జిల్లా బి.సి సంఘం అధ్యక్షులు దేవరాల సుబ్రహ్మణ్యంయాదవ్, జిల్లా బి.సి మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షులు డి.ఆర్.ఇందిర, సింహపురి ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు బాబురావు. వైష్ణవీఫిలిం ఫ్యాక్టరీ ఛైర్మన్ వేణుగోపాల్‌నాయుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యం.భాస్కర రావు, ఉపాధ్యాయులు ఎ.హరీష్, ఎన్.అపర్ణ, "పినాకిని" ఉపాధ్యక్షులు రవిగోగులపల్లి, సభ్యులు ఎన్.కిరణ్‌కుమార్, రామ్‌ప్రభు, ఎన్.సుమన్‌లు పాల్గొని విజేతలకు బహుమతులు అందించారు.

### వికలాంగ బాలలకు

# 'కెనరా' ఆట వస్తువులు



నెల్లూరు పొదలకూరు రోడ్డులోని వియాని హోమ్స్‌లో వికలాంగ పిల్లలకు ఈనెల 19న మాగుంట లేవుట్‌లోని కెనరాబ్యాంక్ 108వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని బ్యాంక్ మేనేజర్ రాజేంద్ర ప్రసాద్ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ అధ్యక్షులు టి.కృష్ణారెడ్డి చేతుల మీదుగా ఆట వస్తువులు పంపిణీ చేసారు. ఈసందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ కెనరా బ్యాంక్ సామాజిక సేవను కొనియాడారు.


### పెన్నా పురస్కారానికి

# 'రగిలే క్షణాలు'



కవిత్వానికి కొలమానాలు లేవు. కాని నిద్దుర పోతున్న మనిషిని సైతం తట్టిలేపే గుణముంది. అటువంటి కవిత్వానికి ప్రతి ఏటా పెద్దపీటవేస్తూ పెన్నాసాహిత్య పురస్కారాన్ని అందిస్తోంది నెల్లూరులోని పెన్నా రచయితల సంఘం(పెరసం). ఆ పురస్కారానికి ఈఏడు ప్రముఖ కవయిత్రి డా॥ సి.భవానీదేవి రచించిన 'రగిలే క్షణాలు' కవితాసంపుటి ఎంపికైందని, డిసెంబర్ 15న నెల్లూరులో జరిగే పెరసం 4వవార్షికోత్సవంలో ఈ పురస్కారాన్ని ప్రదానం చేస్తారని పెరసం వ్యవస్థాపక అధ్యక్షులు మోపూరు పెంచలనరసింహం తెలిపారు.

# కావలిలో మహాదేవ పుష్కరిణి ప్రారంభం



కావలి పట్టణంలోని భ్రమరాంబ సమేత మల్లీశ్వరస్వామి దేవస్థానం ప్రక్కన నూతనంగా నిర్మించిన మహాదేవ పుష్కరిణి ప్రారంభోత్సవం ఈనెల 17, 18, 19 తేదీల్లో శోభాయమానంగా జరిగింది. శంకరానంద సరస్వతిస్వామి సమక్షంలో 17వతేదీ ఉదయం గోపూజ, గోవులచే పుష్కరిణి పరిక్రమ, విఘ్నేశ్వరార్చన, శివపుణ్యాహవచన, పంచగవ్యములచే పుష్కరిణి శుద్ధి, సర్వతీర్థములచే పుష్కరిణి శుద్ధి జరిపి పుష్కరిణిని ప్రారంభించారు. తదుపరి త్రిశూలేశ్వరస్వామి అర్చన, త్రిశూల స్నానములు నిర్వహించారు. సాయంత్రం వేలాది భక్తులచే పుష్కరిణిలో కార్తీకకృత్తికా దీపోత్సవము, మల్లేశ్వరస్వామికి నూతనంగా నిర్మించిన హంస వాహనాలంకృత తెప్పోత్సవము, స్వామి వారి సన్నిధిలో జ్వాలా తోరణోత్సవం కార్యక్రమాలు జరిగాయి. 18, 19 తేదీల్లో ఉదయం ఏకాదశ రుద్రాభిషేకాలు భక్తిపూర్వకంగా జరిపారు. సాయంత్రం భక్తి గీతాలాపన, చాగంటి కోటేశ్వరరావు అమృత ప్రవచనములు జరిగాయి.

PDF Compressor Free Version



# రానున్న రొట్టెల పండుగకు అధునాతన సౌకర్యాలు

## రాష్ట్రమైనారిటీశాఖామంత్రి అహ్మదుల్లా


సభలో ప్రసంగిస్తున్న మంత్రి అహ్మదుల్లా

రానున్న 2014 రొట్టెల పండుగను అధునాతన సౌకర్యాల మధ్య భక్తులు చేసుకో వచ్చని రాష్ట్ర వక్ఫ్ మైనారిటీ శాఖా మంత్రి అహ్మదుల్లా పేర్కొన్నారు. నెల్లూరు బారాషాహీద్ దర్గాలో రూ.11.35 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులను 16వ తేదీ రాష్ట్ర ఆర్థిక శాఖమంత్రి ఆనంరామనారాయణరెడ్డి కలసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి అహ్మదుల్లా మాట్లాడుతూ రెండేళ్ళ క్రితం తను రొట్టెల పండుగ కోసం వచ్చినపుడు దర్గాలో సరైన సౌకర్యాలు లేకపోవడాన్ని గుర్తించి నేడు అధునాతన పనులు చేయిస్తున్నానన్నారు. మంజూరైన నిధులతో సున్నీమసీదు, కమ్యూనిటీహాలు తదితర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ మంత్రి అహ్మదుల్లా రూ.10 కోట్లు దర్గా అభివృద్ధికి హామీ ఇచ్చినప్పుడు అప్పుడు మైనార్టీ బడ్జెట్ రూ.32 కోట్లు ఉండేదని, ఇప్పుడు రూ.1023 కోట్లు బడ్జెట్ ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, కడప దర్గా పీఠాధిపతి ఆరీఫుల్లా హుస్సేన్, మైనారిటీ సంక్షేమశాఖ కమీషనర్ మహ్మద్ ఇక్బాల్,వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ హైదర్‌బాషా, రొట్టెల పండుగ కమిటీ ఛైర్మన్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

# అనాథులకు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



నెల్లూరు నగరం లోని మూలాపేట బ్రహ్మణవీధి గురు నిలయంలో వేంచేసి యున్న శ్రీభగవాన్ వెంకయ్యస్వామి దేవస్థానంలో 16వతేదీ పేదలకు, అనాథలకు, వృద్ధులకు శ్రీవారిపాదరేణువు మాకాని వెంకట్రావు ఆధ్వర్యంలో శీతాకాల దుప్పట్లు పంపిణీ కార్యక్రమం జరిగింది. దాదాపు రెండువేల మందికి దుప్పట్లు పంపిణీ చేసారు. అనంతరం పేదలకు అన్న సంతర్పణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాకాని వెంకట్రావు మాట్లాడుతూ 16వసారి దుప్పట్లు పంపిణీ కార్యక్రమాన్ని దాతల సహాయ సహకారాలతో క్రమం తప్పకుండా పాటిస్తున్నామన్నారు. 1993లో గురునిలయంలో గురుదేవుల ప్రతిష్ఠ జరిగిందని 2011న శ్రీస్వామి వారి విగ్రహంలో అద్భుత శారీరక మార్పులు సంభవించాయని మార్పు చెందిన రెండు శ్రీస్వామి వారి ఫోటోలను భక్తులు వీక్షించి స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని కోరారు. దుప్పట్లు పంపిణీ, అన్న సంతర్పణ కార్యక్రమంలో భక్తులు మనుబోలు ప్రభాకరరావు, అల్లూరు నాగేంద్రసింగ్, శ్రీస్వామి వారి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రబంగారం తరలిపోతుంది


## అక్రమరవాణాలో ఉదయగిరి సెంట్రల్ పాయింట్

నెల్లూరు జిల్లాలో ఉదయగిరి, సీతారామపురం మండలాల పరిధిలోని కొండల్లో ఎర్రచందనం చెట్లు భారీగా వున్నాయి. నాణ్యమైన ఎర్రచందనం కొయ్యలకు అంతర్జాతీయంగా మంచి డిమాండ్ ఉండటంతో కొంత మంది స్మగ్లర్లు ఈ ప్రాంతాలను సెంట్రల్ పాయింట్‌గా చేసుకుని ఎర్రచందనాన్ని అక్రమంగా రవాణా చేస్తూ లక్షలు గడిస్తున్నారన్న విమర్శలు వినవస్తున్నాయి. వీరికి కొంత మంది పోలీసులు, అటవీ అధికారులు, కొందరు మీడియా సిబ్బంది కూడా సహకారం అందిచడంతో ఎర్రచందనాన్ని స్మగ్లింగ్ చేస్తూ లక్షలు గడిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఉదయగిరి, సీతారామపురం, దుత్తలూరు ప్రాంతాల నుంచి పలురకాల వాహనాల్లో ప్రతి రోజు టన్నుల కొద్ది ఎర్రచందనం అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం. భారీ మొత్తంలో పోలీసులు, అటవీశాఖ అధికారులు డబ్బు తీసుకుని వాహనాలను వదిలేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారులు ఈ విషయంపై కఠినంగా వ్యవహరించాల్సిన అవసరముంది.

# జలకళతో సోమశిల

ఇటీవల వర్షాలతో సోమశిల జలాశయానికి నీరుభారీగా వచ్చి చేరుతోంది. ఈనెల 16నాటికి 60000టిఎంసీల నీరుతో సోమశిల ప్రాజెక్టు కళకళలాడింది. దీంతో పెన్నార్ డెల్టాకు పవర్ టన్నెల్ ద్వారా 1400 క్యూసెక్కుల నీరు. 11వక్రస్టుగేటు ద్వారా 2200క్యూసెక్కుల నీరు విడుదల అయ్యింది. వరదకాలువ ద్వారా కండలేరు జలాశయానికి 3000 క్యూసెక్కులు, దక్షిణకాలువకు 200క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 50 క్యూసెక్కులు వంతున నీరు విడుదల అవుతుంది.

## మేషం


అశ్వని, భరణి, కృత్తిక 1 పాదము

ఆర్థిక వ్యవహారాలలో, స్థిరాస్తుల వ్యవహారాలలో ముందు జాగ్రత్తతో ఉండండి. వ్యాపారవర్గాలకు అభివృద్ధి విషయంలో నిరుత్సాహం ఉంటుంది. ఆదాయము సామాన్యము. అవసరాలకు ఋణం చేయవలసి రావచ్చును. ఆర్థిక వత్తిడులుంటాయి. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కాగలవు. రాజకీయవర్గాలు ఇబ్బందులు పడతారు. అనుకోని ఖర్చులుంటాయి.

## వృషభం


కృత్తిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర్ష1, 2పాదాలు

వృత్తి జీవనముకలవారికి అవకాశాలు లభించి తృప్తికరమైన ఆదాయం ఉంటుంది. పారిశ్రామికవర్గాలు కాంట్రాక్టర్లకు వర్కర్లతో సమస్యలుంటాయి. తొందరపాటు మాటలు, ప్రవర్తన ప్రదర్శించవద్దు. వ్యాపార వర్గాలకు పోటీతత్వం పెరిగి అవకాశాలు చేజారవచ్చును. కోర్టు వ్యవహారాలలో వ్యతిరేకత ఉండవచ్చును. ఉద్యోగస్తులకు గుర్తింపు గౌరవాలు కార్యసామర్థ్యం బాగుంటుంది.

## మిధునం



మృగశిర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

వృత్తివ్యాపారాలలో ఆదాయం బాగుంటుంది. మంచి మంచి వ్యాపార అవకాశాలు, పెట్టుబడికి అవకాశాలు దొరుకుతాయి. అనుకున్న పనులు ముందు వెనుకలుగా జరుగుతుంటాయి. ప్రభుత్వపరంగా అను మతులు ఆలస్యం కావడం, కోర్టు కేసులందు అనుకూలత బాగుంటుంది. ఉద్యోగులకు తమతమ విధులందు సామర్థ్యము, అధికారులకు స్థానమార్పులుండగలవు.

## కర్కాటకం


పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

కుటుంబ వ్యవహారాలు ఇబ్బందిపెడతాయి. సర్దు కొని పోవడం వల్ల సమస్యలు సర్దుకుంటాయి. స్త్రీలకు ఆరోగ్య లోపాలుంటాయి. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి దిశగా ముందుకు సాగుతారు. ఆదాయం పెరుగుతుంది. స్థిరాస్తులు, విలువైన వస్తువులు కొనేందుకు ప్రయత్నాలు జరగగలవు. వివాహాది శుభకార్యాలు నిర్ణయానికి రాగలవు. అధికారులకు క్యాంపులు అదనపు బాధ్యత లుంటాయి. చేసే పనులందు టెన్షన్ పడుతుంటారు.



బ్రహ్మశ్రీ
స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 22.11.2013 నుండి తేది. 28.11.2013 వరకు

ఈ వారం మేషంలో కేతువు, మిధునంలో గురువు, మిధున కర్కాటక సింహ కన్యారాశులలో చంద్రుడు, సింహంలో కుజుడు, 26తేది నుండి కన్యలో కుజుడు, తులలో శనిబుధ రాహువులు, వృశ్చికంలో రవి, ధనుస్సులో శుక్రుడు సంచరిస్తారు.

### పంచాంగము:

### ముహూర్తములు


తేది 27 బుధవారము ఉదయం 9.00 నుండి గంట 10.00లోగా ధనుర్లగ్నమున గృహారంభ ఉపనయన వ్యాపార వివాహములు.

రాత్రి గంట 7.30 నుండి గంట 9.46లోగా మిధున లగ్నమున వివాహ గృహప్రవేశములు.

### కార్తీక మాస కృష్ణపక్ష తిథులు


| | | | |
|---|---|---|---|
| తేది. 22 | శుక్ర | పంచమి | రా॥గం. 3.58వ॥ |
| తేది. 23 | శని | షష్ఠి | రా॥గం.6.00వ॥ |
| తేది. 24 | ఆది | సప్తమి | పూర్తిగ |
| తేది. 25 | సోమ | సప్తమి | ఉ॥గం. 7.50వ॥ |
| తేది. 26 | మంగళ | అష్టమి | ఉ॥గం.9.20వ॥ |
| తేది. 27 | బుధ | నవమి | ఉ॥గం.10.20వ॥ |
| తేది. 28 | గురు | దశమి | ఉ॥గం.10.50వ॥ |

## సింహం


మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఆర్థికాభివృద్ధికి చేసే ప్రయత్నాలు, ప్రణాళికలు మంచి ఫలితాన్నిస్తాయి. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. మీ సలహాలు సూచనలు ఇతరులకు ఆమోద యోగ్యం కాగలవు. వ్యాపార భాగస్వామ్యానికి కొత్త వ్యాపారాలకు ప్రయత్నాలు అనుకూలం కాగలవు. వ్యవహారాలలో తొందరపాటు మాటలు, ప్రవర్తన లేకుండా, హామీల విషయంలో జాగ్రత్తపడండి.

## కన్య


ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు


భూములు పొలాలు కొనే విషయంలోను, కొత్త అగ్రిమెంట్లు, కాంట్రాక్టుల విషయంలో జాగ్రత్తలు తీసికొనండి. తొందరపాటు నిర్ణయాలు చేసే అవకాశం ఉంది కాబట్టి జాగ్రత్త అవసరం. కుటుంబవ్యవహారాలలో అనుకూలత సరిగా ఉండదు. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు. వృత్తి వ్యాపారాలలో తీరిక వుండదు. ఆదాయం ఆర్థికాభివృద్ధి బాగుంటుంది.

## తుల


చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు


వృత్తి పరంగా వ్యాపకం ప్రాముఖ్యత ఉండి ఆదాయం స్వల్పంగా పెరుగుతుంది. వ్యాపార వర్గాలకు పెట్టుబడి అవకాశాలు అభివృద్ధి బాగుండి ఆదాయం బాగుంటుంది. ఈ రాశి వారికి ఏదో ఒక రూపంలో అదనపు ఖర్చులుంటాయి. స్థిరాస్తుల లావాదేవీలను వాయిదావేసికొనడం మంచిది. వాహనాలు నడిపే టప్పుడు, ఎలక్ట్రికల్ పనులందు జాగ్రత్త అవసరం.

## వృశ్చికం


విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ


చేపట్టిన పనులు నిదానంగా, సవ్యంగా జరుగుతున్నా టెన్షన్ పడుతుంటారు. వ్యవహారాలలో కొందరి ప్రవర్తన విసుగు, కోపం కలిగిస్తాయి. యజమానులకు వర్కర్ల వల్ల ఇబ్బందులు కలుగుతాయి. కుటుంబసౌఖ్యం బాగుం టుంది. బిడ్డల విద్యా ఉద్యోగ విషయాలపై శ్రద్ధ చూపు తారు. శుభకార్య ప్రయత్నాలు ఆశాజనకంగా ఉంటాయి. దూరప్రయాణాలు తప్పనిసరిగా ఉంటాయి.

## ధనుస్సు


మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

వైద్యఖర్చులు, బిల్లులు చెల్లింపులు తప్పనిసరిగా ఖర్చు చేయవలసి వస్తుంది. కొత్త వ్యాపారాలకు, నూతన పెట్టుబడులకు ప్రయత్నాలు చేస్తారు. స్థిరాస్తుల లావా దేవీలలో ప్రముఖపాత్ర వహిస్తారు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి బాగుండి ఆదాయం పెరుగుతుంది. మీ నిర్ణ యాలు సూచనలు సమావేశాలలో ఆమోదం పొందు తాయి. కోర్టువ్యవహారాలలో అనుకూలత ఉంటుంది.

## మకరం


ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు


అనుకున్న పనులు జరుగుతున్నట్లే ఆశ కలిగిస్తాయి కాని జరగవు. వాహనాలు నడిపేవారు యంత్రాల పనులు చేసేవారు జాగ్రత్తగా ఉండాలి. స్త్రీలకు అనారోగ్య బాధలుంటాయి. వృత్తివ్యాపారాలు ఆశాజనకంగా ఉండి ఆదాయం స్వల్పంగా పెరుగుతుంది. శుభకార్యాల ఖర్చులు, పిల్లల ఖర్చులు అదనంగా ఉంటాయి. ఆర్థికంగా వెసులుబాటు ఉంటుంది.

## కుంభం


ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిషం, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ఆర్థికపరమైన అంచనాలు, ప్రణాళికలు మంచి ఫలితాన్నిస్తాయి. ఆదాయం పెరుగుతుంది. స్థిరాస్తుల లావాదేవీలను వాయిదా వేసికొనడం మంచిది. ప్రయా ణాలలో వస్తువులు, డబ్బు జాగ్రత్త. క్రొత్త పెట్టుబడులకు ఆహ్వానాలు లభిస్తాయి. క్రొత్త వ్యాపారాలు, కొత్త కాంట్రాక్టులు, లీజులకు అనుకూల సమయం. ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు నెరవేరతాయి.

## మీనం


పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

శాస్త్ర సాంకేతిక రంగాల వారికి మంచి అభివృద్ధి గుర్తింపుగౌరవాలుంటాయి. అధికారిక సమావేశాలు, దైవ, సేవాకార్యాలందు పాల్గొంటారు. వ్యాపారవర్గాలకు మంచి అవకాశాలు చేజారిపోవచ్చును. వ్యాపార వర్గాలకు సామాన్య ఆదాయముంటుంది. స్థిరాస్తులు కొనే ప్రయత్నాలు జరుగవచ్చును. వృత్తివర్గాల వారికి పలుకుబడి, ఆదాయం పెరగుతుంది.

# మార్కెట్టులో తూకాల కనికట్టు

- రెండుకేజీలు అడిగితే తూగేది ఒకటిన్నరే
- మోసాన్ని బయటపెట్టిన వినియోగదారుడు
- వ్యాపారులపై మూడుకేసులు నమోదు

నెల్లూరు నగరంలో వున్న ఏసి కూరగాయల మార్కెట్టులో ఇది కొత్తేమీ కాదు. అనాదిగా జరుగుతున్న మోసమే. కాని ఒక వినియోగదారుడు రెండు కేజీల టమోటాలు తీసుకుంటే కేవలం ఒకటిన్నర కేజీలే ఉన్నట్లు పసిగట్టి గట్టిగా వాదించడంతో గుట్టు బట్టబయలైంది. నెల్లూరుజిల్లాలో మరెక్కడా జరగని విధంగా కళ్లముందే తూకంలో మోసాల్ని చేయడం ఏసి కూరగాయల మార్కెట్టు వ్యాపారులకే చెల్లింది. సోమవారం ఒక వినియోగదారుడికి జరిగిన మోసాన్ని ప్రక్కనున్న అందరి వినియోగదారులకు వివరించి వారిలో చైతన్యం తీసుకురావడంతో అందరూ ఒక్కటయ్యారు.

క్షణాల్లోనే తూనికల కొలతల శాఖ నగర ఇన్‌స్పెక్టర్ బిల్లీ అక్కడకు చేరుకుని తూకంలో మోసం జరిగిందని గుట్టు బయటపెట్టడం, వెంటనే ఆ వ్యాపారస్తుడిపై కేసు నమోదుచేయడం జరిగిపోయాయి. మరో రెండు ముద్రలు లేని కాటాలను గుర్తించి కేసులు నమోదు చేసారు.

# కామాక్షమ్మకు వైభవంగా పుష్పయాగం

నెల్లూరు జిల్లా జొన్నవాడలో కొలువైవున్న కామాక్ష అమ్మవారికి ఆదివారం మహాపుష్పయాగాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు, విశేషపూజలు నిర్వహించారు. అనంతరం 108 రకాల పుష్పాలతో మహాపుష్పయాగాన్ని నేత్రపర్వంగా నిర్వహిం చారు. ఆలయంలో మొట్టమొదటి సారిగా మహాపుష్ప యాగాన్ని నిర్వహించడంతో భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రధానార్చకులు వారణాసి శివ గంగప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన మహాపుష్ప యాగానికి ఉభయకర్తలుగా బండి లక్ష్మీనరసారెడ్డి, వెంకటరెడ్డి, తులసీరాంరెడ్డి, అజయ్‌కుమార్ దంపతులు వ్యవహరిం చారు. నెల్లూరు దేవాదాయ ధర్మదాయశాఖ జిల్లా అసిస్టెంట్ కమీషనర్ వేగూరు రవీంద్రరెడ్డి, ఆలయ కార్య నిర్వహణాధికారి కె.శివకుమార్, బ్రహ్మోత్సవ కమిటీ మాజీ ఛైర్మన్ జక్కంరెడ్డి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ వైభోగం...!



హైదరాబాద్ వాస్తవ్యులు కట్టంరెడ్డి వెంకటశేషారెడ్డి - సుమల కుమారుడు **సునీష్‌రెడ్డి - విద్యల** పెళ్ళి ఈ నెల 15వ తేదీ నెల్లూరులో కెజికె కల్యాణ మండపంలో ఘనంగా జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభదీవెనలు.



గోపిక, మాధవ్ థియేటర్స్ జనరల్ మేనేజర్ కె.విజయకుమార్ సోదరుడు కందికట్టు చంద్రశేఖర్ - సునీతల కుమారుడు **సాయి కల్యాణ్ జశ్వంత్ - సువర్ణలత** ల కల్యాణం ఇటీవల విజయవాడలో ఘనంగా జరిగింది. నూతన జంటకు లాయర్ శుభాకాంక్షలు.



పొట్టేపాళెం మాజీసర్పంచ్ ఇందుపూరు శ్రీనివాసులరెడ్డి - సునందల కుమారుడు **ఉదయ్‌శంకర్‌రెడ్డి - మౌనిక** ల వివాహం ఈ నెల 15వ తేదీ నెల్లూరు సిపిఆర్ కల్యాణ మండపంలో ఘనంగా జరిగింది. కొత్త దంపతులకు లాయర్ శుభాభినందనలు.



రియాజ్ హైదరాబాద్ లైటింగ్‌హౌస్ & హైరర్స్ అధినేత రియాజ్ సోదరుని కుమారుడు **షేక్ అఫ్సర్ - సనాఫర్హీన్**ల నిఖా ఇటీవల సిపిఆర్ కల్యాణ మండపంలో వైభవంగా జరిగింది. వధూవరులకు లాయర్ శుభాకాంక్షలు.

# కిసాన్‌నగర్‌లో ఇందిరమ్మ జయంతి



మహిళలకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేస్తున్న అరుణమ్మ

నెల్లూరులోని కిసాన్‌నగర్ న్యూ కాలనీలో ఈనెల 19న భారతదేశ మాజీప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పందిళ్ళపల్లి అరుణమ్మ, వృద్ధులకు, రోగులకు పండ్లు, రొట్టెలు, బిస్కెట్లు పంపిణీ చేసారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ మహిళా నేతల్లో ఇందిరాగాంధీ ప్రథమస్థానంలో నిలుస్తారని, ఆమె ఆశయ సాధన కోసం తాము కృషి చేస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి కోసం భూసంస్కరణలు, 20 సూత్రాల పథకం తదితర సంక్షేమ కార్యక్రమాలు ఆమె చేపట్టిందని, దేశం కోసం ప్రాణాలర్పించిన త్యాగమూర్తి ఆమె అని కొనియాడారు. కార్యక్రమంలో జయమ్మ, పద్మావతమ్మ, నీలిమ, రమణమ్మ, కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరీయుడు దోర్నాలకు టాన్‌టెక్స్ పురస్కారం



అమెరికాలోని తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ టెక్సాస్ టాన్ టెక్స్ ఆధ్వర్యంలో డల్లాస్‌లో దీపావళి వేడుకలు వైభవంగా జరిగాయి. టాన్‌టెక్స్ అధ్యక్షుడు నెల్లూరుకు చెందిన మండువ సురేష్, కార్యవర్గం ఆధ్వర్యంలో అలెన్‌లోని పెర్ఫార్మన్స్ థియేటర్‌లో జరిగిన దీపావళి వేడుకల్లో ప్రముఖ టీవీ నటులు జబర్దస్త్ రాకేష్‌ల ద్వయం అద్భుతమైన ప్రతిభతో నవ్వుల హరివిల్లుతో ప్రేక్షకులను అలరించి నవ్వించారు. సినీనటుడు, టీవీ యాంకర్ ప్రదీప్ తన వాక్చాతుర్యంతో కార్యక్రమాన్ని రక్తి కట్టించారు. ఆ కార్యక్రమంలో టాలీవుడ్ సూపర్ సింగర్స్ సాగర్, రనైనారెడ్డి, పృథ్వీచంద్ర, రాహుల్, సిపిలిగంజ్‌ల పాటలతో, నృత్యాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. టాన్‌టెక్స్ అధ్యక్షులు సురేష్ మండువ చేతుల మీదుగా టాన్‌టెక్స్ పురస్కారాన్ని హర్షధ్వానాల మధ్య నెల్లూరీయుడు, హరివిల్లు క్రియేషన్స్ వ్యవస్థాపకుడు దోర్నాల హరిబాబు అందుకున్నారు.

# పదిమంది ఎస్సైలు బదిలీ

నెల్లూరు జిల్లాలో విఆర్‌లో వున్న 10 మంది ఎస్సైలకు పోస్టింగ్ కల్పిస్తూ జిల్లా ఎస్పీ పివియస్ రామకృష్ణ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు మహిళా పోలీస్‌స్టేషన్‌కు వి.నారాయణ, ఉదయగిరికి ఎస్.కె.హుస్సేన్‌వలీ, కావలి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు ఎస్.కె.సుభాని, కావలి టూటౌన్ పోలీసుస్టేషన్‌కు పి.వి.రమణ, నెల్లూరు ఒకటవ నగర పోలీస్‌స్టేషన్‌కు పి.వెంకయ్య, నెల్లూరు పోలీసు కంట్రోల్ రూంకు పి.సుబ్రహ్మణ్యం, నెల్లూరు స్పెషల్ బ్రాంచ్‌కు ఎన్.శ్రీనివాసులు, నెల్లూరు రెండవ నగర పోలీస్‌స్టేషన్‌కు ఎస్.కె.జిలానీబాషా, నెల్లూరు నాల్గవ నగర పోలీస్‌స్టేషన్‌కు వి.ప్రభాకర్, నెల్లూరు సెంట్రల్ క్రైం స్టేషన్‌కు ఎన్.సుధాకర్‌ను బదిలీ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు.

## రాజ్యాంగ రక్షణ

(మొదటిపేజీ తరువాయి)

మీదటే రాష్ట్రవిభజన విషయమై కేంద్ర హోంశాఖ అటార్నీ జనరల్ జి.ఇ. వాహనవతి తన నివేదిక ఇచ్చారు. ఆంధ్ర ప్రదేశ్‌ను విడదీయాలంటే మూడింట రెండొంతుల మెజార్టీతో ఆర్టికల్ 371- డికి రాజ్యాంగ సవరణ చేయాల్సిందేనని స్పష్టం చేసారు. దేశంలో ఏ రాష్ట్రానికీ లేని ప్రత్యేక ప్రతిపత్తిని ఆర్టికల్ 371-డి ద్వారా ఆంధ్ర ప్రదేశ్‌కు కల్పించారు. రాజ్యాంగంలోని మూడో అధికరణ క్రింద రాష్ట్రాన్ని విభజించే అధికారాలను వినియోగించుకోవాలంటే ఆర్టికల్ 371-డిని ముందుగా రాజ్యాంగ సవరణ ద్వారా తొలగించాల్సిందేనని వాహనవతి హోంశాఖకు నోట్ సమర్పించారు.

పార్లమెంటులో బీజేపీ సంపూర్ణమద్దతు ఉంటేగాని రాజ్యాంగ సవరణ జరగదు. కాని సీమాంధ్ర సమస్యలకు పరిష్కారం చూపాకే బిల్లు మద్దతు విషయం తేలుస్తామని బీజేపీ అంటోంది. టి-బిల్లును రాజ్యాంగ పరంగా ఆమోదింపజేసుకునేంత సమయం లేదు. ఆర్టికల్371-డికి రాజ్యాంగ సవరణ చేసేసరికి ఎన్నికలు తరుముకొస్తాయి. ఇక టి-బిల్లు పక్కన పడిపోతుంది. ఇంతచేసి, ఇన్ని నిందలు మోసి కూడా తెలంగాణ బిల్లును పార్లమెంటు గడప ఎక్కించకపోతే కాంగ్రెస్‌కు ఆశించిన ఫలితం రాదు. కాబట్టే ఆర్టికల్ 371-డి అంశానికి ముసుగేసి రాజ్యాంగ నిబంధనలను కాలరాచి అడ్డదారుల్లో తెలంగాణబిల్లును తెచ్చేందుకు, తద్వారా రాజ్యాంగ విలువలకు సమాధి కట్టేందుకు కాంగ్రెస్ అధిష్టానం సిద్ధపడుతోంది.

## తెగుతున్న సంకెళ్ళు

(మొదటిపేజీ తరువాయి)

బిల్లుకు వ్యతిరేకంగా మద్దతు కూడగట్టే ప్రయత్నాలకు జగన్ శ్రీకారంచుట్టారు. శరవేగంగా అన్ని పార్టీలను కలుస్తున్నాడు. ఈ ప్రయత్నంలో ఆయన విజయం సాధించాలని సమైక్యవాదు... కోరుకుంటున్నారు.

## సమరమే...

(మొదటిపేజీ తరువాయి)

వైకాపావాళ్లు ఆయనపై దుమ్మెత్తి పోస్తున్నారు. కాంగ్రెస్ అధిష్టానం విభజన పరులుగా మారిన కొందరు సీమాంధ్ర కేంద్ర, రాష్ట్రమంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు కూడా ఆయనకు సహకరించడం లేదు. అయినా కూడా కిరణ్ మొండిగా పోతున్నాడు. జివోఎం ఎదుట సైతం రాష్ట్ర విభజనతో వచ్చే కష్టనష్టాలను సమగ్రంగా వివరించాడు. దీనికి సంబంధించి రెండు పుస్తకాలలోవున్న వివరాలను కూడా అందించారు. నా హయాంలో రాష్ట్ర విభజన జరగదని కిరణ్ ఘంటాపథంగా చెబుతున్నాడు.

విభజన విషయంలో ఆయన అధిష్టానానికి ఏ మాత్రం తలొంచడం లేదు. అవసరమైతే సీఎం పదవినే వదులుకోవడానికి సిద్ధంగా వున్నాడు. కిరణ్ మొండి వైఖరితోనే కాంగ్రెస్‌పెద్దలు తలలు పట్టుకుంటున్నారు.

PDF Compressor Free Version





# డివిజన్ గూడూరు వార్తలు

## ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కసరత్తు



ఆక్రమణలపై డీఎస్పీ, కమీషనర్‌తో చర్చిస్తున్న ఆర్డీవో మధుసూదనరావు

గూడూరు పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, అక్రమలపై పోలీస్, రెవెన్యూ మున్సిపల్ అధికారులు దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో ఆర్డీవో ఎన్.మధుసూదనరావు, డిఎస్పీ కె.చౌడేశ్వరి, మున్సిపల్ కమీషనర్ జి.సుశీలమ్మలు కలసి టవర్‌క్లాక్ సెంటర్ నుండి ఆసుపత్రి రోడ్డు, ఐసిఎస్‌రోడ్డు కోనేటిమిట్ట నలజాలమ్మ వీధి, గాంధీబొమ్మ సెంటర్, కుమ్మరవీధి, రాజావీధి ప్రాంతాలను కాలినడకన పరిశీలించారు. ఏఏ ప్రాంతాల్లో నిత్యం ట్రాఫిక్ రద్దీగాఉంటుందో ఆ ప్రాంతాల్లో రహదారి ఆక్రమణకు గురై ఉందా లేదా అన్న దానిపై వారు మ్యాప్‌ను తెప్పించుకొని పరిశీలించారు. ఈ సందర్భంగా 'లాయర్'తో ఆర్డీవో మాట్లాడుతూ గూడూరు పట్టణం బాగా విస్తరించిన తరుణంలో పలు ప్రధాన రహదారులు ఆక్రమణకు గురై ఉన్నాయని, ముందుగా వాటిని గుర్తించి వారికి ప్రత్యామ్నాయ స్థలాలు పరిశీలన చేసి పట్టణంలో అందరికీ సౌలభ్యంగా ఉండేందుకు ఆక్రమణల తొలగింపు కార్యక్రమం చేపడుతామన్నారు. త్వరలో పట్టణంలోని పలు రద్దీవీధులను గుర్తించి ఈ నెలాఖరులోగా వన్‌వే ఏర్పాటు చేస్తామని డిఎస్పీ కె.చౌడేశ్వరి అన్నారు. ఇందుకు తమతో ప్రజా ప్రతినిధులు ప్రజలు, వాహనచోదకులు సహకరించాలని ఆమె కోరారు. వీరి వెంట ఒకటవ పట్టణ ఎస్సై షేక్.షరీఫ్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

## బాలికలు విద్యావంతులు కావాలి



విద్యార్థులకు బకెట్లను ఇస్తున్న సీనియర్ న్యాయవాది వై.చలపతిరావు

నిరక్షరాస్యత కారణంగా ఇంకా బాలికలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని తల్లిదండ్రులు ప్రోత్సహించి వారిని ఉన్నత చదువులు చదివించాలని సీనియర్ న్యాయవాది యరగుడిపాటి చలపతిరావు కోరారు. నెహ్రూ జయంతిని పురస్కరించుకొని తమ తల్లి వేదవతి 81వజయంతి సందర్భంగా స్థానిక బాలసదన్‌లో విద్యార్థులతో సహపంక్తి భోజనం నిర్వహించారు. వివేకానందుని ప్రవచనాలు, విద్యార్థులకు అవసరమైన బకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ బాలికలు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించి తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. అనంతరం జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను అందజేశారు. పిల్లలకు ఎంతో ఇష్టమైన క్రీడాకారుడు సచిన్ టెండూల్కర్ రిటైర్‌మెంట్ సందర్భంగా 200బెలూన్లు గాలిలోకి ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి మల్లు విజయకుమార్‌రెడ్డి, బొల్లినేని హాస్పిటల్ పిఆర్‌ఓ నవీన్ జయకుమార్, హాస్టల్ వార్డెన్ కె.లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

## పట్టుదలతో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు

బల్లి దుర్గా ప్రసాద్‌రావు



విద్యార్థులకు బహుమతి ప్రధానం చేస్తున్న ఎమ్మెల్యే బల్లి

చిన్నతనం నుండే పట్టుదలతో కృషిచేస్తే అనుకున్న లక్ష్యాన్ని సాధించడం గొప్ప కష్టమేమీకాదని గూడూరు శాసనసభ్యులు బల్లి దుర్గా ప్రసాద్‌రావు అన్నారు.

ఇటీవల ఆయన స్థానిక చిల్లకూరు శేషమ్మ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన బాలల దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ ప్రతి ఒక్కరూ విద్యావంతులైతే అనేక విషయాలు తెలుసుకొని అభివృద్ధి చెందవచ్చన్నారు. ఎందరో మహానుభావులు పుట్టిన ఈ గడ్డపై నేటి చిన్నారులు వారి జీవితచరిత్రలను బాగా చదివి వారు ఆస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పండిట్ జవహర్‌లాల్ నెహ్రూపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ఆయన బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్ మల్లెమాల మురళీరెడ్డి, క్లబ్ అధ్యక్షులు జక్కంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఎపిపిఆర్‌డిఎ రాష్ట్ర అధ్యక్షులు షేక్ రియాజ్‌అహ్మద్, ప్రోగ్రామ్ ఛైర్మెన్ కడివేటి చంద్రశేఖర్, కార్యదర్శి వాకాటి రామ్మోహన్, కోశాధికారి టి.లీలామోహన్‌రెడ్డి, రూపేష్‌రెడ్డి, మదనంబేటి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# మూ'వీ'క్షణం



## మరో 'మెగా'స్టార్

మెగాస్టార్ చిరంజీవి ఫ్యామిలీ నుండి ఓ కొత్తస్టార్ రాబోతున్నాడు. శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో నాగబాబు తనయుడు వరుణ్‌తేజ్ హీరోగా పరిచయమవుతున్నాడు. కాగా ఈ చిత్రానికి సంబంధించి అన్ని విషయాల్లో పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్ ఇన్‌వాల్వై వరుణ్‌తేజ్‌కు మార్గదర్శకుడుగా మారాడు.



## ప్రణీత సుడి తిరిగింది

'అత్తారింటికి దారేది' చిత్రంతో ప్రణీత లైఫే టర్నయిపోయింది. ఇప్పుడు ఆమెకు వరుసగా అవకాశాలు వస్తున్నాయి. ప్రస్తుతం ఈమె 'పాండవులు పాండవులు తుమ్మెద' చిత్రంలో మనోజ్ పక్కన, ఎన్టీఆర్ 'రభస'లో సెకండ్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఒక్కసారిగా ఇంత బిజీగా మారిపోవడంతో తదుపరి సినిమాలను ఆచితూచి అంగీకరిస్తుంది. తాజాగా ఒక అవార్డు వేడుకలో ఈమెకు 'ఫేస్ ఆఫ్ ద ఇయర్' అవార్డు వచ్చింది.



## కలెక్షన్లలో 'దూసుకెళ్లలేదు'

ఈమధ్య వచ్చిన సినిమాల్లో 'దూసుకెళ్తా' సినిమాకు మంచి టాక్ వచ్చింది. కాని కలెక్షన్స్‌లో మాత్రం అట్టర్‌ప్లాపయ్యింది. విష్ణు ఈ సినిమాలో నటించడానికి తీసుకున్న శ్రద్ధలో సగం సినిమా ప్రమోషన్‌లో పెట్టివుంటే కలక్షన్స్ పెరిగి వుండేవని సినీవర్గాలటాక్!

## తెరపై మళ్ళీ శింబు-నయన

'వల్లభ' సినిమాతో రెచ్చిపోయి డేటింగ్‌లు చేసుకుని నిజజీవితంలో ఒక్కటవుతారనుకున్న శింబు, నయనతారలు ఆ సినిమా తర్వాత మళ్ళీ కలిసి నటించలేదు. చాలా సంవత్సరాల తర్వాత ఇప్పుడు వీరిద్దరూ కలసి ఓ సినిమాలో నటించబోతున్నారు. తమిళంలో తెరకెక్కుతున్న ఈ సినిమాకు పాండిరాజ్ దర్శకత్వం వహిస్తున్నాడు. వీరిద్దరూ మళ్ళీ మరోహిట్ కొడ్తారో లేదో చూడాలి మరి!



## మిల్క్‌బేబీతో మరోసారి

సక్సెస్‌ఫుల్ పెయిర్‌గా పేరు తెచ్చుకున్న నాగచైతన్య, తమన్నలు మరోసారి జతకట్టబోతున్నారు. రామానాయుడు నిర్మించే చిత్రంలో ఈ జంట కలిసి నటిస్తున్నట్లు తెలుస్తోంది. పంజాబీ సినిమా సింగ్ వర్సెస్ కౌర్‌కు రీమేక్‌గా ఈ సినిమాను తీయబోతున్నట్లు తెలుస్తుంది. కాగా ఈ చిత్రంలో నటిస్తున్నానని తమన్నా ఇంకా ఫైనలైజ్ చేయలేదు. నిర్మాత రామానాయుడు కనుక ఫైనలైజ్ తప్పదు మరి.



## సాయినాథునికి ప్రత్యేక పూజలు

గూడూరు పట్టణంలోని సాయినగర్ ప్రాంతంలో ఉన్న షిర్డీ సాయిమందిరంలో సాయినాథునికి ఇటీవల ప్రత్యేక పూజలు చేశారు. కార్తీకమాసం సందర్భంగా ఆలయంలో సాయినాథునికి సాయివ్రత పూజలు నిర్వహించారు. బాబా విగ్రహాన్ని పుష్పాలతో అలంకరించారు. మధ్యాహ్నం దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం పల్లకీసేవ చేశారు.

## క్యాన్సర్‌పై ముందస్తు అవగాహన

క్యాన్సర్‌పై ముందస్తు అవగాహన కలిగి ఉంటే ఎంతో మంచిదని నెల్లూరు రెడ్‌క్రాస్ సొసైటీ క్యాన్సర్ ఆసుపత్రి ఛీఫ్ మెడికల్ అధికారిణి డాక్టర్ టి.లక్ష్మి అన్నారు. గూడూరు సునీతా సేవా సంస్థ కార్యాలయంలో ఇటీవల క్యాన్సర్ నివారణపై అవగాహన కార్యక్రమం జరిగింది. డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ శరీరంలోని కోట్ల కణాల్లో కొన్ని క్రమపద్ధతి లేకుండా త్వరగా, అసహజంగా పెరగడాన్నే క్యాన్సర్ అంటారన్నారు. రక్త కణాల్లోని ఈ పరిణామాన్ని బ్లడ్ క్యాన్సర్‌గా గుర్తిస్తారన్నారు.

ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను గుర్తించడం ద్వారా సులువుగా నయం చేయవచ్చన్నారు. సంస్థ ప్రధాన కార్యదర్శి సారంగం సులక్ష్మి జూనియర్ వైద్యులు శశికళ, కన్యాకుమారి పాల్గొన్నారు.




7వ వర్ధంతి

మా కంటి వెలుగు, మా ఇంటి మహాలక్ష్మి

శ్రీమతి అళహరి నాగరాజేశ్వరమ్మ గారు

పరమపదించి 2013, నవంబర్ 18వ తేదీకి

7సంవత్సరాలు నిండాయి.

ఆమె తీపి జ్ఞాపకాలను సంస్మరించుకుంటూ

కన్నీటి నివాళి అర్పిస్తున్నాం.

భర్త

అళహరి సత్యనారాయణ

మరియు

కుటుంబసభ్యులు

PDF Compressor Free Version



# సెజ్‌లలో మేటి... శ్రీసిటీ

**శ్రీసిటీ ప్రగతిపై సిఎం కిరణ్ ప్రశంసల జల్లు**

ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను, ఇచ్చే రాయితీలను సద్వినియోగం చేసుకుని సర్వతోముఖాభివృద్ధి సాధించే పరిశ్రమలకు శ్రీసిటీ జాతీయస్థాయిలోనే ఉత్తమ మార్గదర్శిగా నిలుస్తుందని రాష్ట్ర ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు.

చిత్తూరుజిల్లా సత్యవేడు పరిధిలోని శ్రీసిటీలో బుధవారం జరిగిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన 750కోట్ల రూపాయల వ్యయంతో స్టీల్ యంత్ర పరికరాలను తయారుచేసే ఇటలీ దేశ పరిశ్రమ డేనియలీని ప్రారంభించారు. చెన్నై మెట్రో కోచ్‌లను తయారుచేసే ఫ్రాన్స్ దేశ పరిశ్రమ ఆల్‌స్టామ్‌ను సందర్శించారు. అంతకుముందు బిజినెస్ సెంటర్ వద్ద శ్రీసిటీలో ఉత్పాదన మొదలుపెట్టిన 13పరిశ్రమలను, నిర్మాణ దశలో ఉన్న 15పరిశ్రమలను ఆవిష్కరించి 10పరిశ్రమలకు భూమిపూజను నిర్వహించారు. అనంతరం శ్రీసిటీలోని పారిశ్రామికవేత్తలతో నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గత మూడేళ్లలో పలురకాల సమస్యలు ఎదురైనా కోటి 35లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించిన 73 మెగా ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేసామని, తద్వారా కోటి 50లక్షల మందికి ఉపాధి లభించే అవకాశాలు కల్పించామన్నారు. ప్రభుత్వం కల్పించే రాయితీలను సద్వినియోగం చేసుకునే పరిశ్రమలకు ప్రాంతీయ ప్రగతి, ఉపాధి కల్పన, ఆదాయ అభివృద్ధి ముఖ్య లక్ష్యాలు కావాలన్నారు. ఈ విషయంలో సంచలన ప్రగతి సాధిస్తున్న శ్రీసిటీని ఉత్తమ ఉదాహరణగా పేర్కొంటూ శ్రీసిటీ జాతీయస్థాయిలోనే ఉత్తమ ఆదర్శ పారిశ్రామికవాడగా కితాబునిచ్చారు. తొలినుంచి శ్రీసిటీని తాను గమనిస్తున్నానని పేర్కొంటూ అంచెలంచెల అభివృద్ధికి శ్రీసిటీని సజీవసాక్షిగా అభివర్ణించారు. కేంద్రప్రభుత్వం రాష్ట్రంలో చిత్తూరు, మెదక్, ప్రకాశం జిల్లాల్లో మౌలిక వసతుల కల్పనా సౌకర్యాల మండళ్లను ఏర్పాటు చేయనున్నదని, తద్వారా మరింత పారిశ్రామిక ప్రగతి సాధ్యమవుతుందన్నారు. గత ఏడాది విద్యుత్ ఉత్పాదన కొరత కారణంగా కోతలు విధించడం తప్పలేదని అంగీకరిస్తూ భవిష్యత్తులో వేసవి కాలంలో కూడా విద్యుత్ కొరత లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు.



మెట్రోరైలు కోచ్ తయారీ ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి

రాష్ట్ర వాణిజ్య పరిశ్రమలశాఖల ముఖ్య కార్యదర్శి కె.ప్రదీప్‌చంద్ర మాట్లాడుతూ పారిశ్రామిక ప్రగతికి అన్ని రకాల సహాయసహకారాలు అందించడానికి ఏర్పాటు చేసిన సింగిల్‌విండో విధానం సత్ఫలితాలనిస్తోందన్నారు.

ఈ కార్యక్రమాల్లో శ్రీసిటీ మేనేజింగ్ డైరక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ శ్రీసిటీ ప్రగతికి సహకరిస్తున్న వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. శ్రీసిటీలో వివిధ దశల్లో ఉన్న పరిశ్రమల సంఖ్య వందను దాటిందని, ఇవన్నీ పూర్తిస్థాయిలో సిద్ధం అయితే 12,500 కోట్ల అంచనా పెట్టుబడులు లభిస్తాయని, 20వేలమందికి ఉపాధి లభిస్తుందన్నారు. ఈ పర్యటనలో రాష్ట్రమంత్రులు పితాని సత్యనారాయణ, గంటా శ్రీనివాసరావు, పార్థసారథి, సత్యవేడు శాసనసభ్యురాలు హేమలత, శాసనమండలి సభ్యుడు వాకాటి నారాయణరెడ్డి తదితర అధికార అనధికార ప్రముఖులు పాల్గొన్నారు.

# భారత(యువ)రత్న


యూపిఏ ప్రభుత్వం తన అధికార కాలంలో చేసిన మంచి పనులు చాలా తక్కువ. ఎక్కువ వెలుగుచూసింది అవినీతి కుంభకోణాలే! నూటఇరవై కోట్ల భారతావని ఈ కుంభకోణాలన్నింటిని మరిచిపోయే మంత్రం వేసింది యూపిఏ ప్రభుత్వం. ఆ మంత్రమే మాస్టర్‌బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్‌కు దేశ అత్యున్నత పురస్కారం 'భారతరత్న' ప్రకటించడం. దేశంలో సచిన్‌కు కోట్లాదిమంది అభిమానులున్నారు. వీళ్లంతా కూడా సచిన్‌ను క్రికెట్ రత్నంగా చూస్తున్నారు. ఇప్పుడు భారతరత్నగా చూసి మరింత మురిసిపోతున్నారు.

క్రికెట్ మారాజు, రికార్డుల రారాజు సచిన్‌కు తన 200వ టెస్ట్ ఆడి తన కెరీర్‌కు వీడ్కోలు పలికిన కొన్నిగంటలకే కేంద్రప్రభుత్వం ఆయనకు ఈ పురస్కారాన్ని ప్రకటించడం విశేషం. ఆయనతో పాటు ప్రఖ్యాత శాస్త్రవేత్త సిఎన్‌ఆర్ రావుకు కూడా భారతరత్న ప్రకటించారు. దేశచరిత్రలో భారతరత్న పురస్కారం అందుకున్న మొదటి క్రీడాకారుడు సచిన్ కావడం గమనార్హం. అలాగే ఈ పురస్కారం పొందిన అతి పిన్నవారిలో కూడా మొదటివాడు సచినే! సచిన్‌కు గతంలోనే దేశ రెండో అత్యున్నత పురస్కారమైన పద్మవిభూషణ్ వచ్చింది. యూపిఏ ప్రభుత్వం ఆయనను రాజ్యసభ సభ్యుడిగా కూడా నామినేట్ చేసింది.

సచిన్‌కు హడావిడిగా భారతరత్న ప్రకటించడంపై వివాదాలు కూడా లేకపోలేదు. ప్రఖ్యాత హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్‌కు భారతరత్న ఇవ్వాలని ఎప్పటినుండో డిమాండ్ వుంది. కాని ధ్యాన్‌చంద్‌ను విస్మరించి సచిన్‌కు ఇవ్వడం ఓట్ల రాజకీయమేనన్న విమర్శలూ లేకపోలేదు. ఏదిఏమైనా భారత క్రికెట్‌కు జీవంపోసి అంతర్జాతీయ వేదికలపై క్రికెట్ క్రీడకు వన్నెతెచ్చిన సచిన్ ఈ పురస్కారానికి అన్ని విధాలా అర్హుడే! 'భారతరత్న' అందుకున్న ఈ క్రికెట్ ఎవరెస్ట్‌కు 'లాయర్' అభినందనలు.

# వీళ్లిక నిలుస్తారా.. నిలిచినా గెలుస్తారా?

**రాజకీయాల్లో నెల్లూరుజిల్లాకు ఓ విశిష్టస్థానం వుంది. ఈ జిల్లా నాయకులకు మంచి తెలివిగలవాళ్లనే పేరుంది. మనవాళ్లు ఇక్కడే కాదు రాష్ట్ర, జాతీయరాజకీయాల్లో కూడా చక్రం తిప్పుతుంటారు.**





ఒకే జిల్లాకు చెందినవాళ్లు ఒకే సమయంలో 9మంది ఎంపీలు కావడం దేశంలో ఎక్కడా వుండదు. అది ఒక్క నెల్లూరుజిల్లాకే సాధ్యపడింది. నెల్లూరుజిల్లాలో సీట్లు సరిపోక మనవాళ్లు బయటజిల్లాలకు, బయట రాష్ట్రాలకు కూడా పోయి పోటీచేస్తుంటారు.

కాని ఈసారి మన జిల్లా నాయకులకు బయటజిల్లాల్లో సీన్ కట్‌చేయడానికి అక్కడి ప్రజలు కత్తెరలు పట్టుకుని సిద్ధంగావున్నారు. దీనికి ప్రధాన కారణం రాష్ట్ర విభజన వ్యవహారం. ఈ విషయంలో వీరి వ్యవహారం దారుణంగా ఉండడంతో నెల్లూరునేతలు మా దగ్గరకొస్తే తంతాం అన్నట్లుగా ఇతర ప్రాంతాల ప్రజలున్నారు.

తిరుపతి ఎంపీ చింతా మోహన్‌ది మన జిల్లానే. కొడవలూరు మండలం యల్లాయపాళెం ఆయన ఊరు. ఇంతకాలం తిరుపతి లోక్‌సభ పరిధిలోని ప్రజలు ఆయన్ను నెత్తిన పెట్టుకుని ఊరేగారు. కాని రాష్ట్ర విభజన విషయంలో ఆయన అనుసరించిన వైఖరిపై ప్రజలు మండి పడుతున్నారు. తిరుపతిలో ఉవ్వెత్తున సమైక్యాంధ్ర ఉద్యమం జరిగింది. సమైక్యవాదులకు ఆయన మద్దతుగా నిలవలేదు. కాంగ్రెస్ అధిష్టాన నిర్ణయమే నాకు శిరోధార్యమని ప్రకటించి సమైక్యవాదుల గుండెలు మండించాడు. ఇలాంటి చింతా మోహన్‌ను ప్రజలు అదరిస్తారనుకోవడం కలే!

నెల్లూరు లోక్‌సభ జనరల్ కావడంతో పనబాక లక్ష్మి 2009 ఎన్నికల్లో బాపట్ల లోక్‌సభ నుండి గెలిచింది. కాంగ్రెస్ అధిష్టానం తీసుకున్న విభజన నిర్ణయానికి తన సంపూర్ణ మద్దతు తెలిపి సీమాంధ్రలో, ముఖ్యంగా బాపట్ల నియోజకవర్గ ప్రజలకు ఆవేదనను మిగిల్చింది. ప్రజల అభిప్రాయాన్ని మన్నించకపోగా బాపట్లను భాగ్యనగర్‌ను చేస్తానంటూ బడాయికి పోతుంది. నాలుగేళ్లు కేంద్రమంత్రిగా వుండి కూడా ఆమె బాపట్లకు ఒరగబెట్టిందేమీ లేదని ఇక్కడి జనం అంటున్నారు. మరోసారి ఆమె ఇక్కడనుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయాలనుకుంటే అది పెద్ద సాహసమే అవుతుంది.

# పోటెత్తిన భక్తజనం

## -- భక్తిసాగరం నెల్లూరు నగరం --

కులమతాలకు అతీతంగా నెల్లూరు దర్గామిట్టలోని బారాషహీద్‌దర్గా వద్దనున్న స్వర్ణాల చెరువులో జరిగిన రొట్టెల పండుగ వర్షార్పణం అయింది. బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావం వల్ల ఈనెల 16, 17 తేదీలలో భారీ కుంభవృష్టిగా కురిసిన వర్షాల్లో భక్తులు తమ కోరికలను నెరవేర్చుకోలేకపోయారు. అయినా గొడుగులతో భక్తులు భారీగా పాల్గొన్నారు. సోమవారం ఆఖరి రోజు కావడంతో భక్తులు పోటెత్తారు. దూరప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు తమకు కావలసిన రొట్టెలను పట్టుకున్నారు. సోమవారం ఉదయం నుంచి వర్షం తెరపనివ్వడంతో ఎండకూడా రావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బారాషహీదుల దర్శనం చేసుకుని స్వర్ణాల చెరువులో కోర్కెల రొట్టెలను మార్చుకున్నారు. సాయంత్రం నెల్లూరు నగరానికి చెందిన మహిళలు, యువతులు అధిక సంఖ్యలో హాజరై దుకాణాల వద్ద బారులు తీరి వివిధ రకాల వస్తువులను కొనుగోలు చేసారు. మృతవీరులకు సమర్పించిన గంధం కోసం భక్తులు పోటీపడ్డారు. రొట్టెల పండుగలో ఆఖరిరోజు మతపెద్దలు, ముజావర్లు ఆధ్వర్యంలో భక్తులు భక్తి శ్రద్ధలతో తహలీల్ ఫాతెహా(చదివింపులు) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రొట్టెల పండుగ విజయవంతానికి కృషి చేసిన వివిధ శాఖల అధికారులను, కమిటీ సభ్యులను సత్కరించారు.

దర్గా ప్రాంగాణంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ కమీషనర్ శ్యాంసన్, నగర డిఎస్పీ వెంకనాథ్‌రెడ్డి, విద్యుత్‌శాఖ డిఇ జగన్‌మోహన్‌రెడ్డి, తహశీల్దార్ నరశింహాలు తదితర శాఖల అధికారులను సత్కరించారు.

# నెల్లూరు స్కేటర్లకు పతకాల పంట



ఈ నెల 14నుండి 17వరకు రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి స్కేటింగ్‌పోటీల్లో నెల్లూరు స్కేటర్లు తమ సత్తా చాటారు. నెల్లూరు నుండి 30మంది స్కేటర్లు పాల్గొనగా మౌనిక మూడు కాంస్యపతకాలు, సంజన ఒక కాంస్యపతకం, శ్రీచరితారెడ్డి ఒక రజిత, ఒక కాంస్యపతకం, రేవంత్‌రెడ్డి ఒక కాంస్యపతకం సాధించారు.

విజేతలను ది నెల్లూరుజిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్షులు డా॥ జడ్.శివప్రసాద్, కార్యదర్శి జి.ఈశ్వర్‌లు అభినందించారు.

# సీనియర్ జర్నలిస్టు ఎబివి నరసింహారావుకి 'లాయర్' పరామర్శ



ఎబివి నరసింహారావును పరామర్శిస్తున్న ప్రభు

ఇండియన్ ఎక్స్‌ప్రెస్, ఆంధ్రప్రభ దినపత్రికల్లో స్టాఫ్ రిపోర్టర్‌గా పనిచేసి రిటైరయిన కావలికి చెందిన సీనియర్ పాత్రికేయుడు ఎ.బి.వి. నరసింహారావు కిడ్నీలకు సంబంధించిన వ్యాధితో తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. 17వ తేదీ ఆదివారం కావలిలోని ఆయన స్వగృహంలో ఆయనను పరామర్శించిన 'లాయర్' సంగ్రాహకులు "ప్రభు" తుంగా రాజగోపాలరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని నరసింహారావుకి అందించారు. ఆయన వైద్యఖర్చుల నిమిత్తం ఈ మొత్తాన్ని వినియోగించవలసిందిగా కోరుతూ ఇంకా కొంతమంది వదాన్యులచే అవసరమైన మేరకు సహాయం అందించడానికి ప్రయత్నం చేస్తానని చెప్పారు. నరసింహారావు కొద్దిరోజులు 'లాయర్'లో కూడా అసోసియేట్ ఎడిటర్‌గా పనిచేశారు. 'లాయర్' పత్రిక వ్యవస్థాపకులు తుంగా రాజగోపాలరెడ్డితో నరసింహారావుకి స్నేహసంబంధాలు వుండేవి.

గురువారం నాడు నెల్లూరు బొల్లినేని ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేసి ఆయన ఎడమకాలు పాదాన్ని డాక్టర్లు తొలగించారు. చక్కెరవ్యాధి కారణంగా పాదం చెడిపోవడంతో ఈ శస్త్ర చికిత్సను నిర్వహించారు.

Edited, Published, Printed & owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY.